డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి-04 సంచిక-2 ఆగష్టు - 2023 పేజీలు - 44



## రైతు సంక్షేమం సుస్థిరం..





# నల్లులు



ఇరియోఫిడ్ నల్లి



టెట్రానికిడ్ నల్లి

| ఇరియోఫిడ్ నల్లి | | టెట్రానికిడ్ నల్లి |
| --- | --- | --- |
| 1 మి.మీ. కన్నా తక్కువ పురుగు వంటి ఆకారం | పరిమాణం / ఆకారం | 100 మైక్రాన్లకన్నా తక్కువ గోళం వంటి ఆకారం. దీన్నే సాలెపురుగు నల్లి అంటారు. |
| శరీర భాగాలు విభజించబడును | శరీర భాగాలు | శరీర భాగాలు విభజించబడదు |
| రెండు జతలు | కాళ్ళు | నాలుగు జతలు |
| బొబ్బలు, కణుతులు, కాయ పగుళ్ళు, పూసలు | గుర్తింపు | సాలె గూడులు |
| కంది, మిరప, నువ్వులు, కొబ్బరి | ఆశించు పంటలు | జొన్న, ప్రత్తి, బెండ, గులాబీ, వంగ, పసుపు |


డా. బి. వెంకటేశ్వర్లు, డా. జి. రామచంద్రరావు, ఐ.సి.సి., గన్నవరం







ప్రధాన సంపాదకులు
**శ్రీ చేవూరు హరికిరణ్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ స్పెషల్ కమీషనర్



సంపాదకులు
**శ్రీ వల్లూరి శ్రీధర్**
జాయింట్ డైరెక్టర్, ఆర్.బి.కె.

కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**శ్రీ డి. వెంకటేశ్వర్లు,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** ఏడిఎ
**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ
**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎఒ



*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com



డా. వైఎస్ఆర్ రైతు భరోసా సంచిక డిజిటల్ ఎడిషన్
apagrisnet.gov.in అందుబాటులో ఉంది


## విషయసూచిక

ఆగస్టు - 2023

సంపాదకీయం


| | | |
|---|---|---|
| 1. | ఇది రైతు ప్రభుత్వం | 5 |
| 2. | రైతుల పంట ఉత్పత్తులకు భరోసా | 7 |
| 3. | జీవ రసాయనాల తయారీలో కడప ప్రయోగశాల | 9 |
| 4. | మెట్టకు అనుకూలం - అండుకొర్ర | 10 |
| 5. | అండు కొర్రలతో వంటకాలు | 11 |
| 6. | వరిలో కాండం తొలిచే పురుగు | 12 |
| 7. | వరిలో ఆకుముడత పురుగు నివారణ | 13 |
| 8. | ప్రత్తిలో రసం పీల్చే పురుగులు | 14 |
| 9. | చౌడు భూముల్లో యాజమాన్యం | 16 |
| 10. | వేరుశనగలో జిప్సం ప్రాధాన్యత | 17 |
| 11. | కత్తెర పురుగు - సమగ్ర సస్యరక్షణ | 18 |
| 12. | పంటల్లో విత్తన ప్రమాణాలు | 20 |
| 13. | నువ్వులలో సస్యరక్షణ | 22 |
| 14. | చిత్రమాలిక | 23 |
| 15. | పనస సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు | 24 |
| 16. | నిమ్మలో పోషకలోపాలు-సవరణ | 26 |
| 17. | సూక్ష్మ పోషక లోప సవరణతో అద్భుత అరటి | 28 |
| 18. | సత్వరం పెరిగే పొట్ల | 30 |
| 19. | పుట్టగొడుగులు - పోషకాల గనులు | 32 |
| 20. | అంతర పంటలు.. అధిక ఆదాయ మార్గాలు | 34 |
| 21. | విజయగాథ : వినూత్న సాగుకు పట్టం | 36 |
| 22 | రైతుల సందేహాలు - సమాధానాలు | 37 |
| 23. | సందేహాలు - సమాధానాలు | 39 |
| 24. | సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| 25. | సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |











డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా - రూ.300/- యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. 069610100200430 కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు




సంపాదకీయం

# రైతు సంక్షేమం సుస్థిరం

రైతు అవసరాలు గుర్తించాలి, యంత్రాలతో దన్నుగా నిలవాలి, ఆధునిక సాంకేతికత అందించాలి... సమయానికి సలహాలు, సూచనలతో పంట సాగులో తోడ్పడాలి... అధిక దిగుబడులకు చేయూతనందించాలి.. పంట కొనుగోలులో ధరలు గిట్టుబాటయ్యేలా సహాయపడాలి.. ఇవే రైతు సంక్షేమాన్ని సుస్థిరం చేసే అడుగులని ప్రభుత్వం భావిస్తోంది.

సాయం అనేది సకాలంలో అందకపోతే ఆ సాయానికి సార్థకతే ఉండదని రాష్ట్ర ప్రభుత్వం ప్రగాఢంగా విశ్వసిస్తోంది, అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లనుంచి దీన్ని ఆచరణలో చూపిస్తోంది. పుడమి పుత్రులైన రైతులకు ఏ కాలానికి ఏది అవసరమో ముందుగానే గుర్తించి అందుబాటులో ఉంచుతోంది. దుక్కులు మొదలయ్యే సమయానికి పెట్టుబడి సాయంగా వైఎస్సార్ రైతు భరోసా రూపేణా అర్హులైన రైతుల ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తోంది. ఇది గతంలో ఎన్నడూ జరగనిది. దేశంలో ఎక్కడా అమలు కానిది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంది. పంట సాగు చేసిన ప్రతి అర్హుడైన రైతు ఈ- క్రాప్ లో నమోదు చేసుకుంటే చాలు ప్రభుత్వ సాయం అందినట్టే .

మొదట్లో నాలుగేళ్లు మాత్రమే ఇద్దామనుకున్నప్పటికీ రైతుల పరిస్థితిని మానవతా దృక్పథంతోనే చూడాలన్న ముఖ్యమంత్రివర్యుల సూచనల మేరకు ఈ సాయాన్ని అయిదో ఏడాది కొనసాగించింది. అరకోటికి పైగా రైతులు ఏడాదికి మూడుసార్లు అందుతున్న ఈ పెట్టుబడితో పంటల సాగుని సద్వినియోగం చేసుకుంటున్నారు. అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

పెట్టుబడి రాయితీ, పంటల బీమా పరిహారం విషయంలో కూడా ఒక పకడ్బందీ కార్యాచరణ, క్యాలెండర్ రూపొందించుకుని ఆయా పంట కాలాలు పూర్తి కాకమునుపే రైతులకు నగదు అందజేసి రైతు సంక్షేమం పై తన నిబద్ధత చాటుకుంటోంది.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డా. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం దేశానికే నమూనాగా నిలిచింది. రైతు ఒక్క రూపాయి కూడా ప్రీమియం కట్టనక్కర్లేకపోవడం, రైతు వాటా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించడం యావత్తు దేశం దృష్టిని ఆకర్షించింది. అందుకే ఈ విధానం దేశమంతా అమలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది కేంద్రం. ఈ బీమా పథకాన్ని మరింత విస్తృతం చేసేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో జత కట్టింది.

తాజాగా జులై 8న రైతు దినోత్సవం సందర్భంగా 10.20 లక్షల మంది రైతులకు రూ. 1,117.21 కోట్ల బీమా పరిహారాన్ని అందించి వరుసగా నాలుగో ఏడాది రైతులను ఆదుకుంది. ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 54.48 లక్షల మంది రైతులకు డా. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద అక్షరాలా రూ. 7802 .05 కోట్లు అందజేసింది.

అంతకు సరిగ్గా పది రోజుల ముందు వేసవిలో వచ్చిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన 51,468 మంది రైతులకు రూ. 53.62 కోట్ల సొమ్ము జమ చేసి రైతు పక్షపాత ప్రభుత్వం అని నిరూపించుకుంది.

మరో వైపు వ్యవసాయ ఉత్పాదకాల నాణ్యత నిర్ధారణకు రూ. 63.96 కోట్ల వ్యయంతో 52 డా. వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను రైతులకు అందుబాటులోకి తెచ్చింది. దీంతో రాష్ట్రం మొత్తం మీద 127 ల్యాబ్ లు రైతులకు సేవలు అందిస్తున్నాయి

రైతు పంట నష్టపోతే పరామర్శలు, హామీలు కాదు కావాల్సింది, మళ్లీ ధైర్యంగా పంట వేసుకునే నమ్మకం, మద్దతు, అదే ఈ ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసి చూపిస్తోంది.

ప్రస్తుత ఖరీఫ్ కొంత ఆలస్యంగా ప్రారంభమైనా పంటల సాగు కొంత నెమ్మదిగా సాగుతున్నాఅన్నదాతలు అధైర్య పడకుండా ముందుకు వెళ్లేందుకు వెన్ను తడుతోంది, రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు రాయితీపై పంపిణీ పూర్తి చేసింది. ఖరీఫ్ పంట కాలానికి కావాల్సిన ఎరువులు, పురుగు మందుల నిల్వలను రైతులు అడిగిన వెంటనే పంపిణీ చేయడానికి సిద్ధం చేసింది.

# ఇది రైతు ప్రభుత్వం

## ఏ ఒక్క అన్నదాతకూ నష్టం, కష్టం కలగకుండా చూస్తున్నాం

## డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం విడుదలలో సీఎం జగన్

- వైఎస్సార్ పేరు చెబితే రైతులే గుర్తుకు వస్తారు
- నేడు ఒక్క కరువు మండలం లేకున్నా అన్ని విధాలా భరోసా
- వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు
- ఇతర రాష్ట్రాల వాళ్లు మన ఆర్బీకేలను చూసి వెళుతున్నారు
- ప్రీమియం కట్టి, ఉచిత బీమా పరిహారం ఇస్తున్నది దేశంలో మనమే
- 10.20 లక్షల మందికి రూ.1,117.21 కోట్ల బీమా పరిహారం జమ
- నాలుగేళ్లలో రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లకు పైగా వ్యయం



"దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి ఒక్క రైతు తరఫున పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. ఏ గ్రామంలో, ఏ రైతు, ఏ పంటను, ఎన్ని ఎకరాల్లో వేశారన్నది ఈ-క్రాప్ ద్వారా గుర్తించి ఇన్సూరెన్స్ పరిధిలోకి తెచ్చాం. ప్రతి ఆర్బీకే పరిధిలో బ్యాంకు రుణాలు తీసుకున్న, తీసు కోని రైతుల నోటిఫైడ్ పంటలన్నింటినీ ఉచిత బీమా పరిధిలోకి తీసుకొచ్చాం. తద్వారా ఎంత ఎక్కువ మందికి వీలైతే అంత ఎక్కువ పరిహారం ఇప్పించాలనే తాపత్రయంతో అడుగులు ముందుకు వేశాం."

**– సీఎం వైఎస్ జగన్**

గత నాలుగేళ్ళలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం పథకాల వారీగా రైతు సంక్షేమానికి చేసిన కృషిని కళ్యాణదుర్గంలో జూలై 8న జరిగిన సభలో సి.ఎం. ఇలా వివరించారు.

**ఇన్సూరెన్స్ :** గ్రామ స్థాయిలో ఏ రైతన్నకు భారం పడకుండా ప్రతి పంటను ఈ-క్రాప్‌తో అనుసంధానం చేసి ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టడం ద్వారా ఉచిత బీమా పథకం కిందకు తెచ్చాం. ఇలా మన రాష్ట్రంలో తప్ప దేశంలో ఎక్కడా లేదు.

**వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ :** మూడు విడతల్లో వైఎస్సార్ రైతు భరోసా సాయం రూ.13,500 క్రమం తప్పకుండా ఇస్తున్నాం. ఈ నాలుగేళ్లలో 52.38 లక్షల మంది రైతులకు రూ.61,500 చొప్పున వారి ఖాతాల్లో నేరుగా జమ చేశాం. ఈ ఒక్క పథకం ద్వారా రూ.30,985 కోట్లు ఇచ్చాం. ఈ సొమ్ము చిన్న, సన్న కారు రైతులకు సంజీవనిలా ఉపయోగపడుతోంది.

**ఆర్బీకేలు :** 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేశాం. ఇది దేశంలోనే అతిపెద్ద విప్లవాత్మక మార్పు. విత్తనం మొదలు పంట అమ్మకం వరకు.. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు.. సలహాలు సహా ప్రతి అడుగులోనూ రైతులకు అండగా, తోడుగా ఉంటూ వారిని చేయి పట్టుకొని నడిపిస్తున్న వ్యవస్థ గ్రామ స్థాయిలో కనిపిస్తోంది. దేశం మొత్తం మన రాష్ట్రానికి వచ్చి ఎలా జరుగుతోందని చూసి వెళ్తున్నారు.

**ఈ-క్రాప్ :** ఏ రైతు, ఏ పంట, ఎన్ని ఎకరాల్లో వేశాడన్నది గ్రామ స్థాయిలో, ఆర్బీకే స్థాయిలో స్పష్టంగా తెలిసిపోతుంది. దీని ఆధారంగా ఏ ఒక్క రైతు నష్టపోకుండా ప్రతి రైతుకు

పారదర్శకంగా వడ్డీ లేని రుణాలు, ఇన్ పుట్ సబ్సిడీ చివరకు పంటల కొనుగోలులో కూడా మేలు జరుగుతోంది.



**పంట నష్ట పరిహారం :** ఏ సీజన్ లో పంట నష్టం ఆ సీజన్ ముగియక మునుపే రైతుల చేతుల్లో పెడుతున్న ఏకైక ప్రభుత్వం మనదే. ఈ నాలుగేళ్లలో 22.74 లక్షల మంది రైతన్నలకు రూ.1,965 కోట్లు ఇచ్చాం. తద్వారా ఎక్కడా దళారులు, మధ్యవర్తులు, లంచాలు లేవు. నేరుగా అర్హులందరికీ మేలు జరుగుతోంది.

**సున్నా వడ్డీ :** ఏ రైతు అయినా రుణం సకాలంలో చెల్లిస్తే ప్రోత్సాహం ఇస్తూ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తు న్నాం. ఇందులో మన రాష్ట్రం అగ్రగామి. రైతులందరికీ మేలు చేస్తూ ఈ రోజు మీ బిడ్డ ప్రభుత్వం సున్నా వడ్డీ పథకం కింద 73.88 లక్షల మందికి రూ.1,835 కోట్లు ఇచ్చింది.

**ధాన్యం కొనుగోలు :** ధరలు రాకపోతే రైతులు నష్టపో కుండా ఆదుకోవడం కోసం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. మిరప, పసుపు, ఉల్లి, చిరు ధాన్యాలు, అరటి, బత్తాయి పంటలకూ కనీస మద్దతు ధర ప్రకటించాం. మార్కెట్లో రేటు తగ్గితే గ్రామ స్థాయిలో ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. దళారీ, మధ్యవర్తుల వ్యవస్థను పూర్తిగా తుడిచేశాం. చివరకి మిల్లర్లను కూడా తీసివేసి ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు రూ.58,767 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇతర పంటల కొనుగోలుకు రూ.7,633 కోట్లు ఖర్చు చేశాం.

**నాణ్యమైన ఉచిత విద్యుత్ :** రైతన్నలకు పగటి పూటే 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఇందుకోసం రూ.1700 కోట్లతో ఫీడర్ల కెపాసిటీని అప్‌గ్రేడ్ చేశాం. ఇందుకు ఈ నాలుగేళ్లలో రూ.40,000 కోట్లు ఖర్చు చేశాం. మరో 30 ఏళ్ల పాటు రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చే పరిస్థితి ఉండేలా రూ.2.49కే వ్యవసాయ అవసరాల మేరకు 17వేల మిలియన్ యూనిట్లను సరఫరా చేసేటట్టుగా.. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో ఒప్పందం చేసుకున్నాం. ఆక్వా రైతులకూ యూనిట్ రూ.1.50కే ఇస్తున్నాం. ఇందుకు ఈ నాలుగేళ్లలో రూ.2,968 కోట్లు సబ్సిడీగా భరించాం.

**వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం :** ఆర్బీకేల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు సాగులో అవసరమయ్యే యంత్రాలను అందుబాటులో ఉంచాం. రూ.1,100 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని ప్రారంభించాం. దీనికోసం సబ్సిడీ రూపంలో రూ.400 కోట్లు ప్రభుత్వం భరించింది.

**చిరుధాన్యాలకు ప్రోత్సాహం :** బియ్యం మాత్రమే కాకుండా చిరుధాన్యాలను (మిల్లెట్స్) ప్రోత్సహిస్తున్నాం. 8 జిల్లాల్లో ఇంటింటికీ రేషన్ ద్వారా చిరుధాన్యాలు ఇవ్వడం మొదలు పెట్టాం. స్కూళ్లలో రాగిజావ ఇస్తున్నాం. 32 చిరుధాన్యాల ప్రాసెసింగ్ ప్లాంట్లు మొదలు పెట్టాం. చిరుధాన్యాలకు కనీస మద్దతు ధర ఉండేలా అడుగులు వేస్తున్నాం. ఒకవేళ ఆ ధర లేకపోతే ప్రభుత్వమే మార్కెట్లో జోక్యం చేసుకుని కొనుగోలు చేస్తుంది.

**మరింత పటిష్టంగా ఆర్బీకేలు :** రాబోయే రోజుల్లో ఆర్బీకే లను ఇంకా పటిష్టపరచబోతున్నాం. ఆర్బీకే స్థాయిలోనే సాయిల్ టెస్టింగ్ చేయించబోతున్నాం. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ సర్టిఫికేషన్‌ను కూడా ప్రతి రైతన్నకు అందు బాటులోకి తీసుకువస్తున్నాం. వాటి ద్వారా రైతులు ఇంకా ఎక్కువ ధరకు అమ్ముకునే అవకాశం కల్పించడానికి జీఏపీ సర్టిఫికేషన్ తీసుకురాబోతున్నాం. నానో ఫెర్టిలైజర్స్ ను తీసుకురాబోతున్నాం. తద్వారా డ్రోన్లు, ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొస్తున్నాం. ఎరువులు ఎంత అవసరమో అంతే వేసేలా చూస్తాం. ఆర్బీకేల పరిధిలో ప్రైమరీ ప్రాసెసింగ్, జిల్లా కేంద్రాల్లో సెకండరీ ప్రాసెసింగ్ తీసుకువస్తున్నాం. అందుకు తగిన విధంగా గోదాములు ప్రారంభిస్తున్నాం.

# రైతుల పంట ఉత్పత్తులకు భరోసా

★ కనీస మద్దతు ధర కల్పించేలా ప్రత్యేక చట్టం
★ ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్
★ ఆర్బీకే స్థాయిలో మార్కెటింగ్ శాఖ కార్య కలాపాలు
★ వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, డెయిరీ ఉత్పత్తులకు భరోసా




రైతులు పండించిన ప్రతి పంటకు కనీస మద్దతు ధర దక్కేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంలో ఉండే ప్రతి ఒక్కరిపైనా ఉందని, ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఏ ఒక్క రైతూ పంట ఉత్పత్తులను అమ్ముకోడానికి వీల్లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు ఎవరైనా సరే.. కనీస మద్దతు ధర చెల్లించిన తర్వాతే రైతుల నుంచి పంట ఉత్పత్తులు సేకరించేలా చూడాలన్నారు. డిమాండ్ లేదనో మరే కారణం తోనైనా మద్దతు ధర దక్కకుండా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏపీ ఎంఎస్పీ యాక్టు - 2023 తీసుకురావాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో జరుగుతోన్న వివిధ కార్యక్రమాల పురోగతిపై ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించే ఎమ్మెస్పీ ధీమా కల్పించేలా ఈ చట్టం ఉండేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకే కాకుండా ఆక్వా, డెయిరీ రైతుల ఉత్పత్తులకు కూడా రక్షణ కల్పిం చేలా ఈ చట్టాన్ని రూపొందించాలని సూచించారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

**మార్కెటింగ్‌లో ఆర్బీకేల ప్రమేయం :** విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు.. వేటిలోనూ నకిలీ, కల్తీ లేకుండా నివారించడంలో ఆర్బీకేలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అదే రీతిలో మార్కెటింగ్‌లో కూడా ఆర్బీకేల ప్రమేయం ఉండాలి. పంటల సాగు, బీమా కల్పన, ధాన్యం కొనుగోలులో ఆర్బీకేలు ఇప్పటికే రైతులను చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి.

ధాన్యం సేకరణలో ఆర్బీకేల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చేశాం. కనీస గిట్టుబాటు ధరలు రాని ఏ పంట కొనుగోళ్లలో అయినా ఆర్బీకే జోక్యం చేసుకుంటుంది. మిగిలిన పంటల కొనుగోలు కూడా ఆర్బీకే కేంద్రంగా జరిగేలా చూడాలి. ఏ రకమైన కొనుగోళ్లకు అయినా ఆర్బీకే కేంద్రం కావాలి.

**డ్రోన్ టెక్నాలజీ విస్తృతం :** వ్యవసాయ రంగంలో డ్రోన్లను విస్తృతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగంలో బహుళ ప్రయోజనాలు పొందాలి. ఇప్పటికే సూక్ష్మ ఎరువులు, పురుగు మందుల వినియోగం లాంటి కార్యక్రమాలు డ్రోన్ల ద్వారా చేస్తున్నాం. ఇదే కాకుండా డ్రోన్ల ద్వారా భూసార పరీక్షలు చేయించే పరిస్థితిని తీసుకురావాలి. తద్వారా ఆర్బీకే స్థాయిలో భూసార పరీక్షలు జరిగేలా చూడాలి.

భూసార పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడమే కాకుండా, ఎప్పటికప్పుడు డ్రోన్ల ద్వారా తెలుసుకునే పరిస్థితి వస్తే ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌ను సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుంది. పైగా సేకరించే డేటాలో కచ్చితత్వం ఉండేందుకు అవకాశం ఉంటుంది.

సాగులోనే కాదు పంట దిగుబడులపై అంచనాలకు కూడా డ్రోన్లను వినియోగిస్తున్నారు. వరి దిగుబడులను డ్రోన్ల సాయంతో

ఇదే తరహా ప్రయోజనాలు డ్రోన్ టెక్నాలజీ ద్వారా పొందేలా చూడాలి. బహుళ ప్రయోజనకారిగా డ్రోన్లను వినియోగించుకోవడం వల్ల వ్యవసాయ రంగానికి, రైతులకు మరింత మేలు జరుగుతుంది.

**వీడియోల ద్వారా సాగులో శిక్షణ :** 10 వేల ఆర్బీకేల్లో 10 వేల డ్రోన్ల ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాలి. సాగులో శిక్షణ కార్యక్రమాలపై మరిన్ని వీడియోలు రూపొందించి ఆర్బీకే ఛానల్ ద్వారా మరింతగా రైతులకు చేరువ చేయాలి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాధ్యమైనంత ఎక్కువ మంది కౌలుదారులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలి. వీరికి రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలి.

వైఎస్సార్ ఉచిత పంటల బీమా దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ నాలుగేళ్లలో ఇప్పటి వరకు 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802.05 కోట్లు పరిహారంగా అందించాం. రబీ సీజన్కు సంబంధించి పంటల బీమా పరిహారాన్ని అక్టోబర్లో ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

**పంటల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు :** జిల్లాల్లో స్థానికంగా పండే పంటల ఆధారంగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు దిశగా కృషి చేయాలి. నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేయాలి. ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాధ్యమైనంత త్వరగా ఈ యూనిట్లను అందుబాటులోకి తీసుకురావాలి.



# ప్రతి ఆర్బీకేకు అనుబంధంగా కిసాన్ డ్రోన్లు

ఖరీఫ్ సన్నద్ధతతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని అధికారులు సీఎం వైఎస్ జగన్కు వివరించారు. 'ఖరీఫ్-2023 సీజన్లో ముందస్తుగానే ఈ క్రాపింగ్కు శ్రీకారం చుట్టాం. ఎప్పటికప్పుడు డేటాను అప్లోడ్ చేస్తున్నాం. ఈసారి కొత్తగా జియో ఫెన్సింగ్ ఫీచర్ను ప్రవేశ పెట్టాం. నిర్దేశిత గడువులోగా 100 శాతం ఈ క్రాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం. 2.2 లక్షల భూసార శాంపిళ్లను సేకరించి అగ్రిల్యాబ్ల ద్వారా పరీక్షించి ఫలితాలను రైతులకు అందించేలా చర్యలు తీసుకున్నాం. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఈ ఏడాది ఇప్పటికే 4.74 లక్షల కార్డులు జారీ చేశాం. మరింత మందికి సీసీఆర్సీలు జారీ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం' అని వివరించారు. ప్రతి ఆర్బీకేకు అనుబంధంగా కిసాన్ డ్రోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'తొలిదశలో 2 వేల డ్రోన్లు తీసుకువస్తున్నాం. ఇందుకోసం ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీలో 222 మంది రైతులకు శిక్షణ ఇచ్చి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నాం. డ్రోన్లు ఖరీదైనవి కాబట్టి వాటి భద్రత, రక్షణ, నిర్వహణ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనలు పాటిస్తున్నాం. అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎదురుగా వచ్చే వస్తువులను ఢీ కొట్టకుండా నిలువరించే వ్యవస్థ ఉండేలా, నిర్దేశించిన మార్గంలోనే ఎగిరేలా, ఒకవేళ ఇంధన సమస్య వస్తే వెంటనే ఆటో పద్ధతిలో లాంచింగ్ప్యాడ్కు చేరుకునేలా ఈ డ్రోన్ల డిజైన్ ఉం టుంది' అని అధికారులు వివరించారు.

# జీవ రసాయనాల తయారీలో కడప ప్రయోగశాల

పంట సాగులో తెగుళ్ల బెడద అంతా ఇంతా కాదు, ఒక్కోసారి పంట మొత్తం నష్ట పోవాల్సి వస్తుంది. మనం పండిస్తున్న వివిధ పంటలకు చీడపీడల వలన 25-30% వరకు దిగుబడిలో నష్టం జరుగుతోంది. ఈ చీడపీడల నుండి పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు విషపూరిత రసాయనాలను విచక్షణా రహితంగా అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. ఇలాంటి తెగుళ్ళ నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులకు మేలయిన మార్గం జీవశిలీంధ్ర నాశినులు అయిన ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ వీటిని వాడుట వలన 60-80 శాతం వరకు పంటల్లో తెగుళ్ళ తీవ్రతను తగ్గించవచ్చు. ఈ జీవశిలీంధ్ర నాశినులను ఉత్పత్తి చేయడానికి, మన రాష్ట్రంలో ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో జీవ నియంత్రణ ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా జీవనియంత్రణ ప్రయోగశాలను కడపలో నెలకొల్పారు.

**ట్రైకోడెర్మావిరిడి :** ట్రైకోడెర్మావిరిడి రైతులకు మేలు చేయు ఒక శిలీంధ్రం. ఇది వివిధ పైర్ల పెరుగుదలకు సహకరించే మిత్ర శిలీంధ్రము, మొక్కలకు నష్టం కలిగించు హానికరమైన శిలీంధ్రాన్ని అదుపులో ఉంచుతుంది. వేర్లకు కవచంవలె ఏర్పడి హానికరమైన శిలీంధ్రం ప్రవేశించకుండా, రోగనిరోధక శక్తి నిస్తుంది. నాణ్యమైన దిగుబడులు పెంచడంలో ఉపయోగ పడుతుంది.

నివారించు తెగుళ్ళు : కాండంకుళ్ళు, వేరుకుళ్ళు, దుంపకుళ్ళు, మొదలు కుళ్ళు, ఎర్ర కుళ్ళు, ఎండుతెగులు, మాగుడుతెగుళ్ళు మొదలైనవి.

ట్రైకోడెర్మావిరిడి కల్చరు ఉపయోగించు పద్ధతులు :

విత్తన శుద్ధి : ఒక కేజి విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి పొడిని కలిపి వెంటనే విత్తుకోవాలి.

భూమిలో వేయు పద్ధతి : 90 కే.జి,ల మాగిన పశువుల ఎరువు, 10కే.జి,ల వేపపిండిలో, 4కే.జి,ల విరిడి మిశ్రమాన్ని బాగా కలిపి నీడలో కుప్పగా వేసి గోనెసంచి కప్పి నీటిని చిలకరిస్తూ 10-15 రోజుల తర్వాత, ఈ మిశ్రమాన్ని విత్తే ముందు వెదజల్లి దున్నుకోవాలి.

సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ : ఇది ఒక రకమైన బాక్టీరియా. వరి పంటపై వచ్చు బాక్టీరియల్ ఆకు మచ్చ తెగులు, పొడ తెగులు మిరపలో మాగుడు తెగులు, అరటిలో పనామా తెగులు, నువ్వు పంటలో వేరుకుళ్ళు, వేరుశనగలో ఆకుమచ్చ తెగులు, చెరకులో ఎర్రకుళ్లు మొదలగు తెగుళ్ళను సమర్థవంతంగా నివారిస్తుంది. దీనిలోనున్న శక్తివంతమైన బాక్టీరియా వేరు నుండి, ఆకుల నుండి మొక్క కణవ్యవస్థ లోనికి ప్రవేశించి స్థిరనివాసం ఏర్పరచుకొని మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచి పంట పెరుగుదలకు ఉపయోగపడుతుంది.

ఉపయోగించు పద్ధతులు : విత్తనశుద్ధి : 10గ్రా. పొడి మందును ఒక కిలో విత్తనాలను పట్టించాలి. సూడోమోనాస్ బెల్లం, తుమ్మ జిగురును తయారు చేసి విత్తనాలకు పట్టించి 24-48 గంటలు బాక్టీరియా పెరుగునట్లు చేసి విత్తుకొన్నట్లయితే, విత్తనం నుండి, నేలనుండి సంక్రమించే వ్యాధుల నుంచి మొక్కలను కాపాడుకో వచ్చు.

వేర్లను శుద్ధిచేయటం : వరి, వంగ, మిరప పైర్లకు ఒక కిలో సూడోమోనాస్ 200లీ, నీళ్ళను కలిపి, వాటి వేర్లను గంట సమయం పాటు ఈ నీటిలో వుంచి తర్వాత నాటుకుంటే, ఇది తెగుళ్ళను నివారించడమే కాకుండా పెరుగుదలను పెంచుతుంది.

భూమిలో చల్లే విధానం: సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 2 కిలోలు, వేపపిండి10 కిలోలు బాగా చివికిన పశువుల ఎరువు 90 కిలోల మిశ్రమాన్ని కలిపి భూమిలో తేమ ఉన్నపుడు వేసి కలియ దున్నుకోవాలి.

పిచికారీ : 1 కిలో పొడి మందును 200 లీటరు నీటిలో కలిపి ఒక ఎకరా పైరుపై పిచికారీచేయాలి.



**రమణారెడ్డి**
ఎ.డిఏ., కడప ప్రయోగశాల
ఫోన్ : **83310 57387**



# మెట్టకు అనుకూలం అండుకొర్ర

అండు కొర్రలు మెట్ట ప్రాంతాల్లో సాగుకి అనుకూలం. దీన్ని అన్ని రకాల నేలల్లో పండించవచ్చు. సముద్ర మట్టానికి 2500 మీ ఎత్తులో కూడా వేసుకోవచ్చు. ఆహార ధాన్యంగా, పక్షుల దాణాగా, పశుగ్రాస పంటగా గా వేసుకోవచ్చు.

**పంటకాలం:** ఏప్రిల్ రెండో వారం నుంచి ఆగష్టు మొదటి వారం వరకు.

**నేల తయారీ:** ఈ విత్తనం చాలా చిన్నదిగా ఉంటుంది కాబట్టి నేలను బాగా మెత్తగా తయారు చేసుకోవాలి.

**విత్తన మోతాదు:** వరుసల్లో విత్తుకోవడానికి ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. వెదజల్లుటకు ఎకరాకు 3.5-4 కిలోల విత్తనం అవసరం.

**విత్తే దూరం:** వరుసల మధ్య దూరం 45 సెం.మీ., వరుసల్లో మొక్కల మధ్య 10-15 సెం.మీ., దూరం ఉండేలా విత్తుకోవాలి.

**పోషక యాజమాన్యం:** ఎకరాకు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాషియంను ఇచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నుకోవాలి. మళ్లీ 25-30 రోజులకు రెండవ దఫా 8 కిలోల నత్రజనిని పై పాటుగా వేసుకోవాలి.

**కలుపు నివారణ:** అండు కొర్ర పంటకు మొదటి 30-35 రోజులు కలుపు లేకుండా చూసుకుంటే అదిక దిగుబడులు సాధించవచ్చును. ఆ తర్వాత దశలో పంట వేగంగా పెరిగి నేలంతా కప్పివేస్తుంది.

**నీటి యాజమాన్యం:** ఈ పంటకు నీటి అవసరం తక్కువ. అయినప్పటికీ పిలకలు పెట్టే దశలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

**తెగుళ్లు:** తెగులు ఆశించిన మొక్కల ఆకులపై చిన్న, చిన్న జేగురు రంగు మచ్చలు ఏర్పడి అవి క్రమంగా పెద్దవై ఒకదానితో మరొకటి కలిసి ఆకంతా ఎండిపోతుంది.

**నివారణ:** మాంకోజబ్‌తో విత్తన శుద్ధి చేయాలి.

**తుప్పు తెగులు:** ఈ తెగులు సోకిన మొక్కల ఆకులపై ముఖ్యంగా ఆకుల పై భాగంలో చిన్న, చిన్న మచ్చలు ఏర్పడతాయి. అవి ఎరుపు లేదా జేగురు రంగులో ఉంటాయి.

**నివారణ:** పొలం గట్లపై ఎలాంటి కలుపు లేకుండా చూడాలి. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే మాంకోజెబ్ ఒక లీటరు నీటికి 2.5 గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలి.



**డా.యు. త్రివేణి, డా. ఎన్. అనురాధ, డా. ఎస్.కె. అబ్దుల్ సలాం, డా. ఎం.ఎం.వి. శ్రీనివాసరావు, డా. ఎం.దివ్య, డా. సి.హెచ్.శాంతిప్రియ, వ్యవసాయ పరిశోధనా స్థానం, విజయనగరం**

INTERNATIONAL YEAR OF MILLETS 2023

# అండు కొర్రలతో వంటకాలు

అండుకొర్రల్లో బూడిద : 8.62%, తేమ : 7.32%, శక్తి : 362.64 కిలో కేలరీలు, మాంసకృత్తులు : 11.64%, కొవ్వు : 5.28%, పీచు పదార్థం :16.08%, కాల్షియం : 3266.27%, ఇనుము: 178.54. మి.గ్రా, జింక్: 66.10 మి. గ్రా



**చెక్క పకోడి :** ఒక పాత్రలో శనగపిండి, అండు కొర్రల పిండి, ఉప్పు, కారం, వాము, నువ్వులు వేసి మరిగించిన నూనెను పిండిలో వేసి వేడినీళ్ళతో కలిపి ముద్దలా చేసుకోవాలి. బాణలిలో నూనె వేసి కాగిన తర్వాత చక్రాల గొట్టంతో ఒత్తాలి. దీన్ని నూనెలో బంగారు వర్ణం వచ్చే వరకు వేయించాలి. ఇవి కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.



**మెంతి రొట్టె:** వెడల్పాటి గిన్నెలో గోధుమ పిండి, అండుకొర్రల పిండి తీసుకుని ఇందులో ఉల్లిపాయల తరుగు, పచ్చిమిర్చి తరుగు, మెంతికూర, జీలకర్ర, పసుపు, అల్లం ముద్ద తగినంత ఉప్పు కలిపి రొట్టెల పిండిలాగా కలుపుకుని 15 నిమిషాలు తడి ఆరకుండా పక్కన పెట్టుకోవాలి. ఈ పిండి చిన్న ఉండలుగా చేసుకుని అరిటాకు మీద కానీ పీట మీద కానీ రొట్టెల కర్రతో రొట్టెలుగా ఒత్తుకుని పెనం మీద నూనె తో కానీ నెయ్యితో కానీ రెండు వైపులా దోరగా కాల్చాలి. ఏదయినా చట్నీతో తింటే బాగుంటాయి. మెంతి ఆకు బదులు మునగాకు కూడా కలుపుకోవచ్చు. కరివేపాకు పొడి, కొత్తిమీర రొట్టెల పిండికి కలుపుకుంటే మరింత రుచికరంగా ఉంటాయి.



**వాంగీ బాత్ :** బాణలిలో నూనె లేక నెయ్యి తీసుకుని జీలకర్ర, శనగపప్పు, పచ్చి మిర్చి, కరివేపాకు, ఉల్లిపాయల తరుగు ఇంగువతో పోపు పెట్టుకుని. వంకాయ ముక్కలను బాగా మగ్గనివ్వాలి. దీనికి పసుపు, వాంగిబాత్ పొడి కలుపుకుని. ఒక నిముషం తర్వాత ముందుగా ఉడికించి ఉంచుకున్న అండు కొర్రల అన్నాన్ని కలిపి తగినంత ఉప్పు చేర్చుకుంటే కమ్మని అండుకొర్రల వాంగీ బాత్ తయారవుతుంది. ఇందులో కొత్తిమీర, నిమ్మరసం కలుపుకుంటే ఇంకా రుచిగా ఉంటుంది. పోపులో జీడిపప్పు, వేరుశనగ పప్పులు కూడా వేసుకోవచ్చు.

డా. ఎస్.కె. అబ్దుల్ సలామ్, డా. ఎమ్.ఎమ్.వి. శ్రీనివాసరావు, సబీనా మేరీ, డి. శరణ్యరాణి, వ్యవసాయ పరిశోధనా స్థానం, విజయనగరం





# వరిలో కాండం తొలిచే పురుగు

మన దేశంలో సాగయ్యే ఆహార ధాన్యపు పంటలలో వరి ప్రధానమైనది. ఈ పంటను పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, తమిళనాడు, ఒరిస్సా, బీహార్, చత్తీస్ ఘడ్ రాష్ట్రాలలో ఎక్కువగా సాగుచేస్తున్నారు. 72% వరి విస్తీర్ణం, 75% ఉత్పత్తి కేవలం ఈ రాష్ట్రాల నుండే వస్తుందనడం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఎన్నో అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో ఉన్నప్పటికీ, చీడ పీడల వల్ల కలిగే నష్టం మాత్రం అపారంగా ఉంటుంది. దీనికి కారణం చిన్న సన్నకారు రైతులకు పురుగులు, తెగుళ్ళను గుర్తించే అవగాహన లేకపోవడం ఒక కారణమైతే, విచక్షణా రహితంగా పురుగు మందులు పిచికారీ చేయడం మరో కారణంగా చెప్పుకోవచ్చు. విచక్షణా రహితంగా పురుగు మందులు పిచికారీ చేయాడం వల్ల పర్యావరణ కాలుష్యం, నీటి కాలుష్యం,మిత్ర కీటకాల సంఖ్య తగ్గిపోవడం, సాగు ఖర్చులు పెరిగి పోవడం, పిచికారీ చేసే రైతుల ఆరోగ్యం దెబ్బతినటం వంటి నష్టాలు జరుగుతున్నాయి. కాబట్టి చీడ పీడలను గుర్తించి, సరైన సమయంలో సిఫారసుచేసిన పురుగు మందులు, సిఫారసు చేసిన మోతాదులో పిచికారీ చేయడం వలన సమగ్ర సస్య రక్షణ జరుగుతుంది. వరి పంటను తొలి దశలో ఆశించే పురుగులు గురించి చూసుకుంటే

**1. కాండం తొలుచు పురుగు :** వరి పంటలో ప్రధానంగా ఐదు రకాల కాండం తొలిచే పురుగులు ఆశించడం జరుగుతుంది. వీటన్నిటిలోకి పసుపు రంగు కాండం తొలిచే పురుగు వల్ల జరిగే నష్టం ఎక్కువగా ఉంటుంది. ఆడ రెక్కల పురుగు గడ్డి రంగులో ఉండే రెక్కలు కలిగి ఉండి వాటిపై ప్రస్ఫుటంగా కనిపించే నల్లటి మచ్చ కలిగి ఉంటాయి. ఇవి కంది గింజ పరిమాణంలో గుడ్ల సముదాయాలను ఆకు కొసలపైన పెట్టి గోధుమ రంగులో ఉండే వెంట్రుకలతో కప్పి ఉంచడం జరుగుతుంది. ఒక్కో సముదాయంలో 50 నుండి 80 గుడ్లు ఉంటాయి. ఒక్కో పురుగు తన జీవిత కాలంలో 100 నుండి 300 వరకు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు 5-8 రోజుల్లో పొదగబడి పిల్ల పురుగులు బయటకు వస్తాయి. తరువాత వీటి నోటిలోనుండి వెలువడే తీగ లాంటి లాలాజలం సహాయంతో కిందికి వేలాడి, నీటి మట్టానికి 5-10 సెం.మీ పైన ఉండే కాండం భాగంలో రంధ్రం చేసి లోపలికి వెళ్లిపోవడం జరుగుతుంది. ఈ లార్వా దశ లేదా గొంగళి పురుగు దశ 3 నుండి 6 వారాల వరకు ఉంటుంది.

**నష్ట లక్షణాలు :** తొలి దశలో పిల్ల పురుగులు ఆకులను గీకి తినడం వల్ల ఆకులపై వెడల్పాటి తెల్లటి చారలు ఏర్పడతాయి. తరువాత దశల్లో కాండం పై రంధ్రాన్ని చేసి లోపలికి పోయి లోపల ఉండే కణజాలాన్ని తినివేయడం వల్ల మొవ్వ చనిపోవడం జరుగుతుంది. చిరుపొట్ట దశలో అయినట్లైతే కంకికి ఆహారపదార్థం సరిగా అందక గింజ తాలుపోయి తెల్ల కంకులు రావడం జరుగుతుంది. ఇటువంటి తెల్ల కంకులను లాగితే చాలా సులభంగా ఊడి వస్తాయి. పురుగు ఆశించిన కాండాన్ని చీల్చి చూస్తే లేత పసుపు రంగు లద్దె పురుగులు గానీ, పురుగు విసర్జించిన పదార్థాన్ని గానీ గమనించవచ్చు.

**యాజమాన్యం :** ఈ పురుగు రావడానికి ఆలస్యంగా నాట్లు వేయడం, ముదురు నారు నాటడం, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి, సూర్యరశ్మి 7 గంటలు కన్నా ఎక్కువగా ఉండటం ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా ఒక గుడ్ల సముదాయం లేదా 5 % తెల్ల కంకులు గానీ కనిపించిన వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. పురుగు యాజమాన్యం కొరకు వేసవిలో లోతు దుక్కిలు చేయడం వల్ల దుబ్బుల్లో ఉండే గొంగళి పురుగులను కోశస్థ దశలను నివారించవచ్చు. కోత కోసే సమయంలో దుబ్బును నేల మట్టానికి కోయడం వల్ల కూడా కొంత వరకు ఈ పురుగు ఉధృతి తగ్గించవచ్చు. నారుమడి దశలో ప్రతి 5 సెంట్ల నారుమడికి 800

గ్రా. కార్బోఫ్యురాన్ 3జి గుళికలను నారు పీకడానికి వారం రోజుల ముందుగా వేసుకోవాలి. నారు నాటే సమయంలో నారు కొసలను త్రుంచి నాటడం వల్ల పురుగు ఉధృతి చాలావరకు తగ్గించవచ్చు. ఎకరాకు 4 చొప్పున లింగాకార్షక బుట్టలు పెట్టడం ద్వారా పురుగు ఉధృతిని గమనించి తద్వారా నివారణ చర్యలు చేపట్ట వచ్చు. ఎకరాకు 8 నుండి 10 లింగాకార్షక బుట్టలు పెట్టి పెద్ద సంఖ్య లో మగ రెక్కల పురుగులను పట్టుకోవడం ద్వారా ఈ పురుగు ఉధృతి చాలా వరకు తగ్గించుకునే అవకాశం ఉన్నది. అవకాశం ఉన్న ప్రాంతాలలో ట్రైఖోగ్రామా జపానికం అనే గుడ్డు పరాన్న జీవులను నాట్లు వేసిన 35 వ రోజునుండి ఎకరాకు 60 వేల చొప్పున 10 - 15 రోజుల వ్యవధిలో మూడు నాలుగు దఫాలుగా పొలంలో విడుదల చేయాలి. పురుగు ఆర్థిక నష్ట పరిధిని దాటిన వెంటనే, దుబ్బుచేసే దశలో లీటరు నీటికి ఎసిఫేట్ 75 ఎస్.పి మందు 1.5 గ్రా లేక కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి మందు 2.0 గ్రా. కలిపి పిచికారీ చేయాలి. అంకురం లేక చిరు పొట్ట దశలో ఎకరాకు 10 కిలోల కార్బోఫురాన్ 3జి గుళికలు లేదా 8.0 కిలోలు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు లేక క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోల చొప్పున పొలం లో చల్లాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేక క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి దుబ్బు బాగా తడిచేలా పిచికారీ చేయడం ద్వారా కాండం తొలుచు పురుగును సమర్ధ వంతంగా నివారించవచ్చు. పొలంలో రెక్కలపురుగు ఉధృతి గమనించిన వారం పది రోజులలో పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల సమర్ధవంతమైన నివారణ జరుగుతుంది.




# వరిలో ఆకుముడత పురుగు నివారణ

**ఆకుముడత/ నాము:** నాట్లు వేసిన దగ్గర నుండి పోటాకు దశ వరకు ఈ పురుగు తాకిడి ఉంటుంది. పిలకలు కట్టే దశ కంటే పోటాకు దశలో ఆశిస్తే నష్టం ఎక్కువగా ఉంటుంది. దీని యొక్క తల్లి పురుగులు గోధుమ రంగు ముందు రెక్కలు కలిగి, వాటి అంచుల మధ్య అలల వంటి నల్లటి గీతలు ఉంటాయి.

**నష్ట లక్షణాలు :** పురుగు ఆశించిన ఆకులు నిలువుగా ముడుచుకొని, వాటిపై నిలువుగా తెల్లని చారలు ఉంటాయి. ఇటువంటి ఆకు ముడుతను విడదీసి చూస్తే లేత పసుపు రంగులో లేదా ఆకుపచ్చ రంగులో ఉండే పురుగులు గమనించవచ్చు. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పొలాన్ని కదిలిస్తే గుంపులు గుంపులుగా ఎగరడం గమనించవచ్చు.

**అనుకూల పరిస్థితులు :** నత్రజని అధికంగా వాడటం, ఆగష్టు - సెప్టెంబర్ మాసాల్లో ఆలస్యంగా నాట్లు వేయడం, వెడల్పు ఆకు ఉన్న రకాలు ఎక్కువగా సాగుచేయడం, బెట్ట పరిస్థితులు,వారం రోజుల పాటు మబ్బులు పట్టిన వాతావరణం లోను,పొలం చుట్టూ నీడ ఎక్కువగా ఉండే ప్రదేశాలు ఉండే పరిస్థితులలో ఈ పురుగు ఎక్కువగా వరి పంటను ఆశిస్తుంది.

**యాజమాన్యం :** పోటాకు దశలో పొలానికి అడ్డంగా తాడును లాగడం వల్ల ఆకు ముడుత విచ్చుకొని లోపలి ఉండే పురుగులు కింద పడి చనిపోతాయి. తరువాత అవసరాన్నిబట్టి లీటరు నీటికి 1.50 గ్రా. ఎసిఫేట్ 75 ఎస్.పి లేక 2.0 మి.లీ ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి లేక 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ 36 ఎస్.ఎల్ లేక 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి కలిపి పిచికారీ చేయాలి. పోటాకు దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రా. లేక క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్.సి 0.3 మి.లీ. లేదా ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా 8.0 కిలోలు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు లేక క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4.0 కిలోల చొప్పున పొలం లో చల్లాలి. గుళికలు చల్లిన తరువాత నీరు బయటకు పోకుండా గట్లు కట్టేయాలి.

**డా. ఎం.వి.కృష్ణాజీ, డా.ఎన్.శ్రీనివాస రావు, డా. ఎ.డి.వి. ఎస్.ఎల్.పి. ఆనంద్ కుమార్, డా. ఎం.రామభద్ర రాజు, డా. టి.శ్రీనివాస్ , వ్యవసాయ పరిశోధనా స్థానం, మారుటేరు**



# ప్రత్తిలో రసం పీల్చే పురుగులు

మన రాష్ట్రంలో ప్రత్తి సుమారుగా 6 లక్షల హెక్టర్లలో సాగు చేస్తున్న ప్రధాన పంట. 2006-07 వ సంవత్సరం నుండి BG-IIసంకర రకాలు సాగులోకి వచ్చాక కాయ తొలుచు పురుగు ఉధృతి తగ్గి రైతాంగం చక్కటి దిగుబడులు సాధించి నప్పటికీ గత 5-6 సంవత్సరాలుగా గులాబీ రంగు పురుగు ఉధృతి పెరగడం, అధికవర్షాలు, కాయ కుళ్ళు, తలమాడు తెగుళ్ళు అధికమవుతూ దిగుబడులపై ప్రభావితం చూపిస్తున్నాయి.

ప్రత్తి విత్తిన తొలి దశలో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. కాయలు ఏర్పడి పెరిగే దశలో కాయతొలిచే పురుగు ప్రధానంగా గులాబీ రంగు పురుగు 30-70 % వరకు ప్రత్తి దిగుబడులను ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం రైతాంగం ప్రత్తి విత్తుకోవడంలో నిమగ్నమై ఉన్నారు. ఈ తరుణంలో తొలిదశలో ఆశించు రసం పీల్చే పురుగుల అదుపునకు తీసుకోవలసిన చర్యలు గురించి తెలుసుకుందాం.

**పచ్చ దోమ :** పంట తొలిదశ నుంచి 60 రోజులవరకు ఆశిస్తుంది. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పచ్చ దోమ పంట చివరివరకు ఆశిస్తుంది.

**లక్షణాలు :** పిల్ల పురుగులు, తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఆకులనుంచి రసం పీల్చడం వల్ల ఆకులు మొదట లేతపసుపు రంగులోకి మారి తరువాత ముదురు ఎరుపు రంగుకు మారి ఎండి రాలిపోతాయి. పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు మొక్కలో ఎదుగుదల క్షిణించి గిడసబారి పోయి, మొగ్గలు ఏర్పడక దిగుబడులకు తీవ్ర నష్టం కలుగుతుంది.

**పేనుబంక:** ఆకుల అడుగు భాగాన లేదా చిగుళ్ల పై చేరి ఆకులనుండి రసాన్ని పీలుస్తాయి పేనుబంక ఆశించిన మొక్కలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి ఆకులు దోనెలుగా ముడుచుకుని ఉంటాయి. ఈ పురుగులు తేనెవంటి ద్రవాన్ని స్రవిస్తాయి. దీనిపై నల్లని బూజు వ్యాపించి మొక్క అంతా నల్లగా కప్పివేస్తుంది. ప్రత్తి నాణ్యత దెబ్బ తింటుంది. తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మొగ్గలు రాలి కొత్త మొగ్గలు రాక దిగుబడి తగ్గుతుంది

**తామర పురుగు :** వాతావరణం పొడిగా ఉండి, వర్షాభావ పరిస్థితులలో ఉధృతి తీవ్రంగా ఉంటుంది. పెద్ద మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగు బాగాన చేరి ఆకులను గీకి రసం పీలుస్తాయి. దీనివలన ఆకుల అడుగు భాగం గోధుమ రంగులోకి పైభాగం వెండివలె మెరిసే చారలు కలిగి ఉండి. ఆకులు వంకరలు తిరిగి ముడతలుపడి చివరకి పెళుసుబారి ఎండిపోతాయి. TNV (తలమాడు) అనే వైరస్ తెగులుకు వాహకంగా పనిచేసి ప్రత్తి మొక్కలో వైరస్ వ్యాప్తికి దోహద పడుతుంది.

**తెల్లదోమ :** ఈ పురుగు పంట మధ్య కాలంలో ఎక్కువుగా వస్తుంది. సాధారణంగా పంట పూత, కాయ దశలో ఎక్కువుగా ఆశిస్తుంది. దీనివలన పూత కాయ పక్వానికి రాక దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి.

తెల్లదోమ కూడా పేనుబంకలాగా తేనెవంటి పదార్ధాన్ని విసర్జిస్తాయి. దీనివలన బూజు తెగులు వ్యాపించి దూదిని కూడా కలుషితం చేస్తాయి.

**పిండినల్లి :** పురుగులు ఆకుల నుంచి, కొమ్మల నుంచి రసాన్ని పీలుస్తాయి. దీని వలన పసుపు పచ్చగా మారి క్రమేపీ ఎండిపోతాయి. పురుగులు పూత మరియు కాయలను కూడా ఆశిస్తాయి.

ప్రత్తి లో రసం పీల్చే పురుగులు అదుపునకు తప్పనిసరిగా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

ప్రతి సంవత్సరం ఒకే పొలంలో ప్రత్తిని మాత్రమే పండించరాదు.





పచ్చదోమ/పేనుబంక రెండూ కనిపించిన యెడల మొక్కలకు 5% వేప గింజల కషాయం లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి. లీ, లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. పిచికారీ చేయాలి.

తామర పురుగు ఆకుకు 10 పురుగులు ఉన్నట్లయితే ఫిప్రోనిల్ 2 మి. లీ, లేదా అసిపేట్ 1. 5 గ్రా .. పిచికారీ చేసుకోవాలి.

తెల్ల దోమ ఆకుకు 10 తల్లి పురుగులు లేదా 20 పిల్ల పురుగులు ఉన్నట్లయితే 5%వేపగింజల కషాయం లేదా థయో మిథాక్సికామ్ 0. 2 గ్రా . పిచికారీ చేయాలి.

పిండినల్లి ఉన్నట్లయితే ఎకరానికి 20 మొక్కలలో కనీసం ఒక మొక్కకు పూర్తిగా వ్యాపించినప్పుడు అసిపేట్ 1. 5 గ్రా .. లేదా ప్రోఫినో పాస్ 3 మి.లీ. ఈ విధంగా సమగ్ర సస్యరక్షణ పాటించి ప్రత్తిలో రసం పీల్చే పురుగులను అదుపు చేయవచ్చును.

ఇతరపంటలతో పంట మార్పిడి చేయాలి. ప్రధానంగా రసంపీల్చే పురుగులను తట్టుకునే సూటి రకాలను సాగుచేసుకోవాలి. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. అంతర పంటలుగా పెసర, సోయాచిక్కుడు, అలసంద, కంది వంటి అంతర పంటలు సాగుచేసుకోవాలి. దీనివలన మిత్ర పురుగుల సంఖ్య బాగా పెరిగి ప్రత్తి పైరును నష్ట పరిచే పురుగులను అదుపులో ఉంచుతుంది. ప్రత్తి పంట చుట్టూ జొన్న లేదా మొక్కజొన్న తో కంచె పంటలుగా వేసుకోవాలి. రసం పీల్చు పురుగులను అదుపులో ఉంచడానికి కాండం పూత విధానాన్ని అవలంబించాలి.

తెల్ల దోమ ఉనికిని తెలుసుకోడానికి ఎకరానికి 10 చొప్పున పసుపురంగు జిగురు అట్టలు, తామరపురుగులను గుర్తించడానికి నీలం రంగు జిగురు అట్టలు 10 ఎకరానికిచొప్పున పెట్టుకోవాలి. పంట 40 రోజుల దశలో 5 శాతం వేప గింజల కషాయాన్ని 1 లీటరు చొప్పున ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

పిండినల్లికి ఆశ్రయాన్ని ఇచ్చే కలుపు మొక్కలను పీకి నాశనం చేయాలి. పురుగు ఎక్కువుగా ఆశించిన మొక్కలను వేర్లతో సహా పీకి నాశనం చేయాలి.





**డా. ఎం. సుధారాణి, డా. కె.వి. శివారెడ్డి, డా. సిహెచ్. రాణి, డా. దయానా గ్రేస్, డా. వెంకట లక్ష్మి, బి. శ్రీలక్ష్మి, లాం, గుంటూరు**



# చౌడు భూముల్లో యాజమాన్యం

సాధారణంగా సరైన పంటను ఇవ్వని, అసలే పండని పొలాలను చౌడు భూములు అంటారు. ఈ భూముల్లో సరయిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సమస్యను తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చును ఇవి ముఖ్యంగా రెండు రకాలు.

**1. ఉప్పు నేలలు (పాల/తెల్ల చౌడు).**

**2. కారు (నల్ల), చౌడు లేక క్షార నేలలు. ఉప్పు, నల్ల చౌడు నేలలను పొలంలో గుర్తించడం.**

**3. సమస్య గుర్తించదగిన లక్షణాలు**

**ఉప్పు నేలలు (పాల/తెల్ల చౌడు)** : భూఉపరితలం పై తెల్ల పొరలుగా ఏర్పడడం, తగినంత తేమ ఉన్నప్పటికీ మొక్కలు వడలిపోవడం.

**కారు (నల్ల), చౌడు లేక క్షార నేలలు** : మురుగు నీరు నిల్వ ఉండడం, నేల గట్టిపడడం, తక్కువ నీరు ఇంకే గుణం, నీరు మట్టికోత, మట్టి రేణువులు విడిపోవడం వల్ల నల్లని రంగు సంతరించుకుంటుంది. మొక్కల పెరుగుదల క్షీణించి ఆకుల అంచుల వెంబడి ఎండి మాడిపోతాయి.

**ఉప్పు నేలలు యాజమాన్య పద్ధతులు**

నేలపై పేరుకుపోయిన ఉప్పు లేక తెల్ల చౌడును పారలతో తొలగించాలి. వాలుని బట్టి పొలాన్ని చిన్న చిన్న మడులుగా చేసుకోవాలి. ప్రతి మడిలో 15-20 అంగుళాల వరకు నీరు పెట్టి బాగా దమ్ము చేయాలి. దీనివల్ల నీటిలో లవణాలు కరుగుతాయి. 3 లేక 4 రోజుల తర్వాత ఇంకిపోయి మిగిలిన నీటిని మురుగు కాలవల ద్వారా బయటకు పంపాలి.

ఈ భూముల్లో పచ్చిరొట్ట, పశువుల ఎరువు, సూపర్ ఫాస్ఫేట్ ను ఎక్కువగా వాడాలి. అధిక మోతాదులో నత్రజని ఎరువులు వాడాలి. విత్తేటప్పుడు విత్తనాన్ని 0.1 శాతం ఉప్పు ద్రావణంలో 2-3 గంటలు నానబెట్టి నానిన విత్తనాన్ని నాటుకోవడం మంచిది. స్వచ్ఛమయిన నీరు అందుబాటులో లేనప్పుడు ఉప్పు నీటిని తట్టుకొనగలిగే వరి, చెరకు, జొన్న, సోయా, బొబ్బర. సజ్జ, ఆవాలు లాంటి పైర్లను పెంచుకోవాలి.

**కారు చౌడు నేలలు** : ఈ నేలల్లో నీరు ఇంకే స్వభావం తక్కువ. కాబట్టి మొదటగా పొలాన్ని చిన్న, చిన్న మడులుగా చేసుకుని వాటి నుంచి మురుగు నీరు పోయేలా లోతయిన మురుగు నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.

ఈ భూముల్లో జీలుగను పెంచి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నాలి. రెండు, మూడు సంవత్సరాలు వరుసగా ఈ ప్రక్రియ చేపడితే నల్ల చౌడు పూర్తిగా విరిగి పైర్లు బాగా ఎదిగి మంచి దిగుబడులు వస్తాయి.

ఈ నేలలు బాగు చేయడానికి జిప్సం వేయాలి. ఉదజని సూచికను అనుసరించి జిప్సాన్నినేలపై చల్లి, మట్టిలో కలిసేలా బాగా కలియదున్నాలి. నీరు పెట్టి వారం రోజుల నిలకట్టాలి. తర్వాత మురుగు కాలువల ద్వారా నీటిని బయటకు తీసివేయాలి. రసాయన ఎరువులు సాధారణం కన్నా 25 శాతం ఎక్కువ వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. నారు చిక్కగా నాటి తగినన్ని మొక్కలు ఉండేటట్లు చూడాలి. ఈ నేలల్లో లేత నారు కన్నా ముదురు నారు తేలిగ్గా నిలదొక్కుకొంటుంది. కారు చౌడు తట్టుకునే పైర్లు ఎన్నుకోవాలి.

చౌడు భూములు వ్యవసాయానికి పనికి రాకపోయినా సరైన పద్ధతిలో వాటిని బాగు చేసుకుని వ్యవసాయ యోగ్యంగా మారిస్తే సాగయ్యే విస్తీర్ణం పెరిగి అధికోత్పత్తికి దోహదపడుతుంది.

**డా.సుజని రావు చల్లా**
**ప్రధాన శాస్త్రవేత్త, ఐసిసి, గన్నవరం**



# వేరుశనగలో జిప్సం ప్రాధాన్యత

జిప్సం అనేది ఒక తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న ఎరువు ఇందులో పంటలకు కావలిసిన సున్నం 23 శాతం, గంధకం 18 శాతం ఉంటాయి. సాధారణంగా ఈ జిప్సంను వేరుశనగలో వాడతారు. ప్రధాన పోషకాలయిన నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటుగా వేరుశనగ పైరుకు సరిపోయినంత సున్నం, గంధకం కాయల అభివృద్ధికి, నాణ్యమయిన కాయ దిగుబడికి కావాలి.

వేరుశనగలో అధిక దిగుబడి, నాణ్యమైన కాయలను పొందడానికి కాయల్లో గింజ పూర్తిగా నిండుకునేటట్లు సున్నం దోహదం చేస్తుంది. కాల్షియం అధికంగా ఉండే నేలల్లో వచ్చే దిగుబడిలో గింజ బాగా నిండి గట్టికాయలు ఏర్పడతాయి. భూమి ఉదజని, ఆమ్ల లక్షణాలు క్రమబద్ధం చేసి మొక్కకు కావలసిన పోషక పదార్థాలు లభించేటట్లు చేస్తుంది. అంతే కాకుండా అల్యూమినియం, ఇనుము, మాంగనీసు వంటి పోషక పదార్థాలు స్థాయి మొక్కకు హాని కలిగించే స్థాయికి చేరకుండా అరికడుతుంది. వేర్ల అభివృద్ధికి తోడ్పడి తద్వారా బెట్టను తట్టుకునే శక్తిని కలిగిస్తుంది. ఊడలకు శక్తినిచ్చే పెరుగుదలకు తోడ్పడుతుంది.

మొక్కలో తగినంత గంధకం ఉండడం వలన మాంసకృత్తులు తయారవడం, ఎంజైములు పనిచేసే సామర్థ్యం పెరిగి మొక్క ధృడంగా ఉంటుంది. గంధకం మొక్కల్లో శ్వాస ప్రక్రియకు వేరుపై బుడిపెల అభివృద్ధికి, వేరుశనగ కాయల రంగు పెరుగుదలకు, ఆకులు ముందే రాలకుండా అరికట్టడం, మొక్కలకు కాయలు (ఊడలకు) గట్టిగా అతుక్కుని ఉండడానికి నూనె తయారు చేసే ప్రక్రియలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

## జిప్సం వేసే పద్ధతి

కాల్షియం, గంధకం లోపం వల్ల వచ్చే లోప లక్షణాలు జిప్సం వేయడం ద్వారా అరికట్టవచ్చును. ఎకరాకు 200 కిలోల జిప్సంను పంట గరిష్ట పూత దశలో (ఖరీఫ్ లో విత్తిన 35-40 రోజులకు, రబీలో 40-45 రోజులకు) వేసుకోవాలి. రెండవసారి కలుపు తీసే ముందు జిప్సంను వేసి తవ్వితే కాయలు అభివృద్ధి చెందే పొరల్లో (4-5 సెం.మీ లోతులో) పడుతుంది.

జిప్సం వేసిన వేరుశనగలో ఇతర పోషకాలను తీసుకోవడం కూడా ఎక్కువగానే ఉంటుంది. కనుక పైన సూచించిన విధంగా వేరుశనగలో జిప్సంను వేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చును.

డా.సుజని రావు చల్లా
ప్రధాన శాస్త్రవేత్త, ఐసిసి, గన్నవరం



# కత్తెర పురుగు - సమగ్ర సస్యరక్షణ

కత్తెరపురుగు వివిధ పంటలను ఆశించి నష్టపరుస్తూ ఉండే ఆందోళన కరమైన పురుగు. మొక్కజొన్న, సజ్జ జొన్న,పంటలను కాలీఫ్లవర్, కాబేజి, దొండ, బీర, మిరప, టమాటా, వంగ మొదలగు కూరగాయలను ప్రత్తి, అలసంద, వేరుశనగ, ఆలుగడ్డ, సోయా చిక్కుడు, వరి, చెఱకును కూడా ఆశించి నష్ట పరుస్తుంది. పంటలో ఈ కత్తెరపురుగు 73% పంట నష్టాన్ని కలుగ చేస్తుంది. కాబట్టి రైతు సోదరులు ఈ కత్తెరపురుగును గుర్తించి సకాలంలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులను చేపట్టినట్లయితే నివారించి అధిక దిగుబడులను పొందవచ్చు.









**గుర్తింపు చిహ్నాలు, జీవిత చక్రం : రెక్కల పురుగు** : వీటి మగ రెక్కల పురుగు ముందు రెక్కల అంచుల మీద తెల్లటి మచ్చ ఉంటుంది. ఈ మచ్చ ఆడ రెక్కల పురుగులలో ఉండదు. రెక్కల పురుగు సుమారుగా 10 రోజుల వరకు ఉంటుంది.

**గుడ్లు** : ఆడ రెక్కల పురుగు గుడ్లను గుంపులు గుంపులుగా ఆకుల పైభాగం మీద, క్రింద భాగంలో కాండం మొదటిలో పెడుతుంది. గుంపులో సుమారుగా 40-60 వరకు గుడ్లు ఉంటాయి. ఒక్కొక్క ఆడ రెక్కల పురుగు 1500-2000 వరకు గుడ్లను పెడుతుంది. గుడ్లు వెంట్రుకలతో కప్పి ఉంటాయి. వీటి గుడ్లు మొదట ముత్యపు ఆకారంలో తెల్లగా ఉండి పగిలేటప్పుడు నల్ల రంగులోకి మారుతాయి. గుడ్డు దశ 2-3 రోజులు ఉంటుంది.

**లార్వా** : లార్వా తల మీద తిరగ త్రిప్పిన Y ఆకారంలో మచ్చ ఉంటుంది. 8వ ఉదర ఖండితం మీద నాలుగు నల్లటి మచ్చలు చతురస్రాకారంలో అమరి ఉంటాయి. కత్తెర పురుగు యొక్క లార్వా 6 దశలలో ఉంటుంది. ఈ దశ సుమారుగా 14-21 రోజుల పాటు ఉంటుంది.

**కోశస్థ దశ** : ఈ పురుగు యొక్క కోశస్థ దశ మొవ్వలో గాని భూమిలో గాని ఉంటుంది. భూమిలో సుమారు 2-8 సెం.మీ. లోతులో కోశస్థ దశకు చేరుతుంది. కోశస్థ దశలో 7-14 రోజుల వరకు ఉంటుంది.

**నష్ట పరిచే విధానం** :ఈ పురుగు మొక్కజొన్న పైరు మొలకెత్తిన దశ నుంచి ఆశించి నష్టం కలుగ చేస్తుంది. లార్వా మొదటి దశలు, ఆకు పత్ర హరితాన్ని గోకి తినడం వలన ఆకులు తెల్లబారినట్లుగా కనిపిస్తాయి. తరువాత దశలు మొవ్వలోనికి

ప్రవేశించి, ఆకులను కత్తిరించి తింటాయి. మొవ్వ విచ్చుకున్నప్పుడు రంధ్రాలను వరుసగా చూడవచ్చు. వీటినే “షాట్ హోల్స్” అంటారు. అలాగే రంధ్రాలు పెద్దవిగా ఉంటే “విండో పేన్స్” అంటారు. గొంగళి పురుగు పెరిగేకొద్దీ ఆకుల చివరల నుండి తింటూ ఆకులను కత్తిరించినట్లుగా కనిపిస్తూ ఆకులను పూర్తిగా తినివేయుట గమనించవచ్చు. ఆకు సుడులను , కాండాన్ని కూడా తొలచి రంధ్రాలను చేసి పంటను నష్ట పరుస్తుంది. ప్రత్యుత్పత్తి దశలో ఈ పురుగు కండెలోకి కూడా ప్రవేశించి గింజలను తిని నష్టం కలుగజేస్తుంది.

**సమగ్ర సస్యరక్షణ పద్ధతులు** :వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. ఇందువలన కోశస్థ దశలు బయటపడి సూర్యరశ్మి వేడికి చనిపోతాయి.

పంట చుట్టూ నాలుగు వరసలు నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవాలి. కత్తెర పురుగు గుడ్లను, లార్వాలను ఏరి నాశనం చేయాలి.

ఎకరానికి 4-5 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకొని పురుగుపై నిఘా ఉంచుకోవాలి.

**విత్తన శుద్ధి** :కిలో మొక్కజొన్న/ జొన్న/ సజ్జ విత్తనానికి 6 మి.లీ. ఫోర్టాన్జా duo (సయాంత్రి నిలిప్రోల్ + థయోమిథాక్సామ్) పురుగు మందును కలిపి విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే పంటను 20 రోజుల వరకు కత్తెర పురుగు బారి నుండి పంటను రక్షించుకోవచ్చు.

**పంట మొదటి దశ (20-25 రోజులు)** :

గుడ్ల సముదాయాలను గుర్తించి ఏరి వేసి నాశనం చేయాలి.

కత్తెర పురుగు గ్రుడ్లను ఆశించే ట్రైకోగ్రామా బదనికలను ఎకరానికి 20,000 చొప్పున పొలంలో విడుదల చేయాలి. కత్తెర పురుగు గ్రుడ్లను గమనించిన వెంటనే బదనికలను విడుదల చేయాలి.

ట్రైకోగ్రామా బదనికలను విడుదల చేసిన వారానికి ఒక లీటరు వేపనూనె లేక 5% వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ట్రైకోగ్రామా బదనికలు లభించకపోయినట్లయితే కత్తెర పురుగు గుడ్లను గమనించిన వెంటనే ఒక లీటరు వేప నూనె లేదా 5% వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలి.

తొలి దశ గొంగళి పురుగులను నివారించుటకు 500 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 400 మి.లీ. క్వినాల్ఫాస్ ఎకరానికి పిచికారీ చేయాలి.

**పంట 2వ దశ (25-50 రోజులు)** :ఈ దశలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఎకరానికి ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.డి. 80 గ్రా. లేదా స్పైనోశాడ్ 45% ఎస్.సి. 60 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మి.లీ. లేదా స్పైనటోరామ్ 100 మి.లీ. సుడులు లేదా మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

పురుగు మందుల పిచికారీ బదులు కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను ఎకరానికి 3 కిలోల చొప్పున పైరు మొలకెత్తిన 25-30 రోజులకు ఆకుల సుడులలో వేసుకోవాలి.

మొవ్వలలో పెద్ద గొంగళి పురుగులను చూసినట్లయితే 10 కిలోల తవుడు + 2 కిలోల బెల్లం + 100 గ్రా. థయోడికార్బ్ పొడి మందును ఉపయోగించి విషపు ఎరలను తయారు చేసుకొని చిన్న చిన్న గోలీలుగా ఈ ఎరలను మొక్క సుడులలో వేసుకోవాలి.



డా. యం. నగేష్, ఏరువాక కేంద్రం,
లాం, గుంటూరు.






# పంటల్లో విత్తన ప్రమాణాలు

నేటి వ్యవసాయంలో రైతులు పంటలు పండించడంలో అనేక ఒడిదుడుకులు ఎదురుకొంటున్నారు. వాటిలో ఒకటి నాణ్యమైన విత్తనాల లభ్యత. వ్యవసాయ పనులు కాలం సమయంతో ముడిపడి ఉన్నవి. సకాలంలో మంచి నాణ్యమైన విత్తనాలు విత్తితేనే ఆరోగ్యకరమైన పంట చేతికి వస్తుంది. విత్తిన విత్తనం నాణ్యమైనది కాకపోతే అప్పటివరకు పొలం తయారీకి, ఎరువులకు పెట్టిన పెట్టుబడి వృధా అవడమే కాకుండా అదును దాటిపోతుంది. మరలా విత్తుకునే అవకాశం లేకుండా పోతుంది. అందువలన వ్యవసాయ పంటల్లో విత్తనాల నాణ్యతకు సంబంధించిన ముఖ్యమైన అంశం. రైతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

| వ.నెం | పంట పేరు | భౌతిక స్వచ్ఛత కనిష్టం | జడ పదార్థం గరిష్టం | మొలకశాతం కనిష్టం | తేమశాతం గరిష్టం |
|---|---|---|---|---|---|
| వ్యవసాయ పంటల్లో విత్తన ప్రమాణాలు | | | | | |
| 1. | బార్లీ | 98% | 2% | 85% | 12% |
| 2. | వరి | 98% | 2% | 80% | 13% |
| 3. | గోధుమ | 98% | 2% | 85% | 12% |
| 4. | మొక్కజొన్న | 98% | 2% | 90% | 12% |
| 5. | జొన్న | 98% | 2% | 75% | 12% |
| 6. | సజ్జ | 98% | 2% | 75% | 12% |
| 7. | రాగి, వరిగ, కొర్ర, సామలు, ఊదలు | 97% | 3% | 75% | 12% |
| 8. | మినుము | 98% | 2% | 75% | 9% |
| 9. | శనగ | 98% | 2% | 85% | 9% |
| 10. | అలసంద | 98% | 2% | 75% | 9% |
| 11. | పెసలు | 98% | 2% | 75% | 9% |
| 12. | ఉలవలు | 98% | 2% | 80% | 9% |
| 13. | బఠాణీ | 98% | 2% | 75% | 9% |

| వ.నెం | పంట పేరు | భౌతిక స్వచ్ఛత కనిష్టం | జడ పదార్థం గరిష్టం | మొలకశాతం కనిష్టం | తేమశాతం గరిష్టం |
|---|---|---|---|---|---|
| 14. | కంది | 98% | 2% | 75% | 9% |
| 15. | రాజ్మా (ఫ్రెంచ్ బీన్) | 98% | 2% | 75% | 9% |
| 16. | ఆముదం | 98% | 2% | 70% | 8% |
| 17. | వేరుశనగ | 96% | 4% | 70% | 9% |
| 18. | ఆవాలు | 97% | 3% | 85% | 8% |
| 19. | కుసుమ | 98% | 2% | 80% | 9% |
| 20. | నువ్వులు | 97% | 3% | 80% | 9% |
| 21. | సోయా చిక్కుడు | 98% | 2% | 70% | 12% |
| 22. | పొద్దుతిరుగుడు | 98% | 2% | 70% | 9% |
| 23. | ప్రత్తి | 98% | 2% | 65% | 10% |
| 24. | జ్యూట్ | 97% | 3% | 80% | 9% |
| 25. | గోరు చిక్కుడు | 98% | 2% | 70% | 9% |
| 26. | ఓట్లు | 98% | 2% | 85% | 12% |
| 27. | గోగు | 98% | 2% | 75% | 10% |
| 28. | జనుము | 98% | 2% | 80% | 9% |
| 29. | పొగాకు | 95% | 5% | 70% | 6% |
| **ఉద్యాన పంటల్లో** | | | | | |
| 30. | వంగ | 98% | 2% | 70% | 8% |
| 31. | క్యాప్సికం (స్వీట్ పెప్పర్) | 98% | 2% | 60% | 8% |
| 32. | మిరప (హాట్ పెప్పర్) | 98% | 2% | 60% | 8% |
| 33 | బెండ | 99% | 1% | 65% | 10% |
| 34. | ముల్లంగి | 98% | 2% | 70% | 6% |
| 35. | టమాటో | 98% | 2% | 70% | 8% |
| 36. | బూడిద గుమ్మడి: | 98% | 2% | 60% | 7% |
| 37. | కాకర | 98% | 2% | 60% | 7% |
| 38. | సొర | 98% | 2% | 60% | 7% |
| 39. | దోస | 98% | 2% | 60% | 7% |
| 40. | తర్బుజా | 98% | 2% | 60% | 7% |
| 41. | గుమ్మడి | 98% | 2% | 60% | 7% |





## ఆలస్యంగా విత్తే

# నువ్వులలో

## సస్యరక్షణ

నువ్వులను ఖరీఫ్‌లో ఆలస్యంగానైనా కూడా సాగు చేసి మేలైన సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చును.

**సస్యరక్షణ: రసం పీల్చే పురుగులు :** పిల్ల, తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీలుస్తాయి. పురుగులు ఆశించిన ఆకులు ముందుగా పాలిపోయి, తర్వాత ఎండిపోతాయి.

**తెల్లనల్లి** : ఈ నల్లి ఆశించిన ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారి, ఈనెలు పొడవుగా సాగి, కింద వైపునకు ముడుచుకొనిపోతాయి. దోనె ఆకారంగా మారి పాలిపోతాయి. **నివారణ** : మోనోక్రోటోఫాస్ 1.6 మిలీ లేదా డైమిథోయేట్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. డైకోఫాల్ 5 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ఆకుముడత, కాయ తొలుచు పురుగు** : తొలిదశలో గొంగళి పురుగులు లేత ఆకులను కలిపి గూడు కట్టి లోపలి నుండి, ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని గోకి తినడం వల్ల ఆకులు ఎండిపోతాయి. పురుగులు ఎదిగిన కొద్దీ ఎక్కువ ఆకులను కలిపి గూడుగా చేసుకుని ఆకులను తింటాయి. మొగ్గ ఏర్పడే దశలో మొగ్గలను, పూతను, కాయల్లోని లేత గింజలను తింటూ పంటకు నష్టం చేస్తాయి. **నివారణ** : మోనోక్రోటోఫాస్ 1.6 మిలీ క్లోరోపైరిఫాస్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**బిహారీ గొంగళి పురుగు** : తొలి దశలో చిన్న గొంగళి పురుగులు గుంపులుగా, ఆకుల్లోని పత్ర హరితాన్ని గోకి తిని, జల్లెడాకులుగా చేస్తాయి. ఎదిగిన గొంగళి పురుగులు ఇతర మొక్కల పైకి పాకుతూ మొగ్గలకు, పువ్వులకు, కాయలకు, రంధ్రాలను చేస్తూ విత్తనాలను తినేస్తాయి. **నివారణ** : పంటలో గుడ్లను కానీ గొంగళి పురుగుల్ని కానీ గమనించిన వెంటనే ఆకులతో సహా నాశనం చేయాలి. క్లోరోపైరిఫాస్ 2.5 మిలీ (లేదా) ఎసిఫేట్ 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**కోడు ఈగ** : చిన్న పురుగులు లేత మొగ్గ, పూత తినేయడం వల్ల మొగ్గలు పువ్వులుగా, కాయలుగా ఏర్పడక, గింజ పట్టక తాలు కాయలు ఏర్పడతాయి. ఆశించిన మొగ్గ, పూత వాడి రాలిపోతుంది. **నివారణ** : పురుగు ఆశించిన మొగ్గల్ని తాలు కాయల్ని ఏరి నాశనం చేయాలి. మొగ్గ దశలో మోనోక్రోటోఫాస్ 1.6 మిలీ లేదా ఎసిఫేట్ 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వెర్రి తెగులు/ పుట్టు జుత్తు/ఫిల్లోడి**: ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. సాధారణంగా ఆలస్యంగా వేసిన పంటలో ఎక్కువగా వస్తుంది. ఆకులు చిన్నవై పువ్వు లోని భాగాలన్నీ ఆకులలాగా మారిపోయి కాయలు ఏర్పడవు. మొక్కల ఎదుగుదల తగ్గి, పై భాగంలో ఆకులు గుబురుగా ఉండి, వెర్రి తల మాదిరిగా ఉంటుంది. దీపపు పురుగుల ద్వారా వ్యాపిస్తుంది.

**నివారణ** : తెగులు కనిపించిన వెంటనే తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టాలి. పైరుపై మిథైల్ డెమటాన్ 2 మిలీ లేదా డైమిథోయేట్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


డా. కె.తేజేశ్వర రావు,
డా.ఎం. స్వాతి,
డా.కె.లక్ష్మణ, ఏరువాక కేంద్రం,
విజయనగరం

# చిత్రమాలిక




వరుసగా నాలుగవ ఏడాది : కళ్యాణదుర్గంలో పంటల బీమా పరిహారం చెక్కు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రివర్యులు



సాగులో ఆదర్శం : అనంతపురం జిల్లా అభ్యుదయ రైతులతో ముఖ్యమంత్రి వర్యులు



మరింత వసతి : బహుళ ప్రయోజన గోదాములను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రాయితీ విత్తనం : గుంటూరు జిల్లాలో కందులు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రైతు సేవలు విస్తృతం : నెల్లూరు జిల్లాలో ఆర్‌బికెను సందర్శించి సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ప్రత్యేక కమీషనర్




మీ సూచనలు, సలహాలు అమూల్యం : రాష్ట్ర స్థాయి వ్యవసాయ సలహామండలి తొలి సమావేశంలో మంత్రులు కాకాణి, కారుమూరి, అంబటి, వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులు



# పనస సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు



పనస ఉష్ణమండలపు పంట. వెచ్చని తేమతో కూడిన ఉష్ణమండల వాతావరణం పనస సాగుకు బాగా అనుకూలం. తేమతో కూడిన కొండ వాలు ప్రాంతాలు, 22-30 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత బాగా అనుకూలం. వర్షాభావ పరిస్థితులను తట్టుకోలేదు. పనస అనేక రకాల నేలల్లో పండించినా, సాగుకు బాగా సారవంతమైన ఒండ్రు నేలలు అనుకూలం.

**పనస రకాలు :** పనస రెండు రకాలుగా వర్గీకరించబడ్డాయి. 1.కాయలు చిన్నవిగా ఉండి పీచు ఎక్కువగా కలిగి, మృదువైన, మెత్తటి, అత్యంత తీపి కలిగిన తొనలు ఉన్నవి. 2. కాయలు పెద్దవిగా ఉండి, అధిక నాణ్యత కలిగి, తొనలు పెద్దవిగా, కొబ్బరి ముక్కల వలె ఉండి తీపి కలిగినవి.

**ఎరువుల యాజమాన్యం :** పనస మొక్కల వయస్సు ఆధారంగా ఎరువులను క్రింద పట్టికలో తెలిపిన విధంగా ఎరువులను వేయాలి.

| మొక్క వయస్సు | యూరియా గ్రా. | సూపర్ ఫాస్ఫేట్ గ్రా. | పొటాష్ గ్రా. | పశువుల ఎరువు కి. |
|---|---|---|---|---|
| 1-3 సం. | 400 | 800 | 100 | 25 |
| 4-6 సం. | 900 | 1500 | 200 | 50 |
| 7సం.నుండి | 1300 | 1900 | 400 | 100 |

సిఫార్సు చేసిన ఎరువులను రెండు దఫాలుగా జూన్-జులై నెలల్లో మరియు అక్టోబర్-నవంబర్ నెలల్లో వేయాలి. ఎరువులను వేసిన వెంటనే నీటి తడులు ఇవ్వాలి. నేలలో సేంద్రియ పదార్థాలు ఎక్కువగా ఉంటే మొక్కల ఎదుగుదల బాగుంటుంది కాబట్టి పచ్చిరొట్ట, పశువుల ఎరువు మొదలైనవి విరివిగా వాడాలి.



**పూత సమయం :** పనసలో సాధారణంగా డిసెంబర్-జనవరి మాసాలలో పూత ప్రారంభమవుతుంది. ఆడ, మగ పుష్పాలు విడివిడిగా వస్తాయి. ఆడ పుష్పాలు ప్రధాన కాండం, కొమ్మల మీద వస్తాయి. అందువల్ల ప్రధాన కాండం మీద 1.5-2 మీ. ఎత్తు వరకు ఎలాంటి ప్రక్క కొమ్మలు లేకుండా చూసుకోవాలి. మగ పుష్పాలు కొమ్మల చివరి భాగాలలో వచ్చి కొద్ది రోజుల తర్వాత ఎండి రాలిపోతాయి. ఒకే చెట్టు మీద మగ, ఆడ పుష్పాలు ఒకే సమయంలో రావు. అందువల్ల ఆడ పుష్పాల ఫలదీకరణ కోసం కనీసం నాలుగైదు చెట్లను ఒక చోట వేయడం మంచిది.

**కాయల కోత :** కళ్ళు పూర్తిగా విచ్చుకొని, లేత పసుపు

పచ్చ రంగులోకి మారి సువాసనలను వెదజల్లే కాయలను కోయాలి. పనసకు ఒకసారి కాసిన చోటే మరల కాసే గుణం ఉంది. కాబట్టి కాయల కోత సమయంలో కొద్దిగా తొడిమ వదిలి కోయాలి. కాయలను లాగినా, బెరడును గాయపరిచినా, కాండం మీద సూక్ష్మంగా ఉండే మొగ్గలు నశిస్తాయి. అలాగే కొమ్మలను, రెమ్మలను తొలగించే టప్పుడు కొద్దిగా కొమ్మ భాగాన్ని వదిలి నరికి నట్లేతే మొగ్గలు దెబ్బ తినవు. కాయలను కోసిన తరువాత ఎండిన రెమ్మలను తీసివేసి కాండం మీద వెలుతురు పడే విధంగా కొమ్మలను కత్తిరించి మరల కాపర్‌ఆక్సీక్లోరైడ్ మందును 3 గ్రా.చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకొని ఎరువులను వేసి తడిపెట్టాలి.

**సస్యరక్షణ : పురుగులు : కొమ్మ, కాయ తొలుచు పురుగు :** రెక్కల పురుగులు లేత కొమ్మలపైన, పిందెలపై గుడ్లు పెడతాయి. గుడ్ల నుండి వెలువడిన గొంగళి పురుగు లేత కొమ్మలను, పూ -మొగ్గలను, పిందెలను తొలచి తినడం వల్ల అవి ఎండి రాలిపోతాయి. కాయలు కుళ్ళి పోతాయి. ఈ పురుగు వలన సుమారు 30-35% నష్టం కలుగుతుంది. నివారణకు పురుగు ఆశించిన కొమ్మలను, కుళ్ళిన కాయలను ఏరి నాశనం చేయాలి. పూత, పిందె దశలలో, చిగుళ్ళ దశలో వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పిందె దశలో కాయలకు పాలిథిన్ సంచులను తొడిగి పురుగు ఉధృతి తగ్గించవచ్చును. కొమ్మలకు ఆశించినట్లయితే కొమ్మల రంధ్రాలలోదాగి ఉన్న పురుగులను ఊసతో తీసివేసి క్లోరిపైరిఫాస్ 50% ఇ.సి. మందును దూదిలో మంచి మట్టితో మూసివేయాలి.



**పిండినల్లి:** ఇవి ఆకు అడుగు భాగం లేదా కాయ తొడిమ భాగంలో చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు, పండ్లు ఎండి పోతాయి. దీని నివారణకు అక్టోబరు మాసంలో పొలంలో తడి ఉండేలా చూసుకోవాలి. నవంబరులో చెట్టు చుట్టూ దున్నాలి. క్రిప్టోలీమస్ మాంట్రుజరి బదనికలను 10-15 చెట్టుకు విడుదల చేయాలి. ప్రొఫినోఫాస్ 2 మి.లీ. / లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



**తెగుళ్ళు: రైజోపస్ కాయ కుళ్ళు :** ఈ తెగులు కారణంగా 15-32% పంట నష్టం వాటిల్లుతుంది. దీనివలన కాయలు పక్వానికి రాకుండానే కుళ్లడం వలన నాణ్యత కోల్పోతాయి. తేమ ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు మాంకోజబ్ 2.5 మి.లీ. లీటరు నీటికి లేదా కార్బండిజమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిందె సమయంలో, కాయ ఎదుగుదల సమయంలో 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.





**పనస ఆరోగ్యానికి ఎన్నో విధాలా మేలు చేస్తుంది**

- రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.
- చర్మాన్ని కాంతివంతం చేస్తుంది.
- శక్తి సామర్థ్యాలను పెంచుతుంది.
- రక్త హీనతను దరి చేరనివ్వదు.
- అధిక రక్తపోటుని నియంత్రిస్తుంది.
- ఆరోగ్యకరమైన దృష్టికి దోహదపడుతుంది.
- ఎముకల దృఢత్వానికి సహాయపడుతుంది.
- మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతుంది.

డా. టి. క్రాంతికుమార్, డా. పి. లలితా కామేశ్వరి, కె. వీరాంజనేయులు, డా. ఎస్. ఆదర్శ, డా. ఎన్. చిరంజీవి, డా. ఆర్. ప్రవీణ్‌బాబు, కె.వి.కె., పందిరిమామిడి



# నిమ్మ, చీనిలో పోషకలోపాలు- సవరణ

మన రాష్ట్రంలో నిమ్మ, చీని తోటలు అధిక విస్తీర్ణం లో సాగు చేయబడుతూ అధిక దిగుబడినిస్తున్నవి. ఈ తోటల్లో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి మంచి రకాల ఎంపికతో పాటు సమగ్ర పోషక యాజమాన్యం కూడా ఎంతో అవసరం.

**నత్రజని :** నత్రజని లోపిస్తే ఆకులు పసుపు రంగుకు మారడం, మొక్క ఎదగక పోవడం వంటివి జరుగుతాయి. సిఫారసు చేసిన మోతాదులో నత్రజని ఎరువులను వాడుకోవాలి.

**భాస్వరం :** భాస్వరం వేర్ల అభివృద్ధికి పని చేస్తుంది. భాస్వరం లోపిస్తే ఆకులు ఎరుపు, ఊదా రంగులోకి మారుతాయి. సిఫారసు చేసిన మోతాదులో భాస్వరం ఎరువులను వాడుకోవాలి.

**పొటాషియం :** సాధారణంగా సున్నం సహజంగా ఎక్కువగా ఉన్న నేలల్లో, సూపర్ ఫాస్పేట్ అధికంగా వేసిన నేలల్లో పొటాషియం లోపాలు కనిపిస్తాయి. పొటాషియం లోపించినప్పుడు, ఆకులు మెలికలు తిరిగి, ముడుచుకొని పోతాయి. మొక్కల పెరుగుదల తగ్గిపోతుంది. ఆకుల అంచులు పసుపు వర్ణంలోకి మారతాయి. పిందెలు వేసే దశలో పొటాషియం లోపిస్తే, పిందెలు ఎక్కువగా రాలిపోతాయి, కాయల పరిమాణం తగ్గుతుంది. దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్ నేలలో వేసి పొటాషియం లోపాన్ని సరిదిద్దవచ్చు. ఒక శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని చెట్టు అంతా తడిసేలా పిచికారీ చేసి కూడా లోపాన్ని సవరించవచ్చు.

**జింకు :** జింకు లోపించినపుడు, కొత్తగా పెరిగే కొమ్మలు, లేత ఆకుల్లో ఈనెల మధ్య భాగాలు పసుపు రంగుకు మారతాయి. ఆకుల మధ్య కాండం పొడవు తగ్గి, ఆకులు గుబురుగా అగుపడతాయి. కొమ్మల చివర్లు ఎండిపోతాయి. కొమ్మలు పైనుండి కిందివరకు క్రమంగా ఎండిపోతాయి. పండ్లు చిన్నవిగా, తొక్క మందంగా ఉండడమే కాక రుచిని కోల్పోతాయి.



కాయల నాణ్యత తో పాటు దిగుబడి కూడా తగ్గిపోతుంది. జింకు లోపాన్ని సవరించుటకు 100 గ్రాములు జింకు సల్ఫేటును చెట్టు మొదలులో మట్టిలో కలిసేలా వేయాలి. వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు 0.25 శాతం జింకుసల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేసి కూడా జింకు లోపాన్ని సరిదిద్దవచ్చు.



**మాంగనీసు :** సాధారణంగా జింకు లోపాలు కనిపించే సందర్భాలలో మాంగనీసు లోపాలు కూడా కనిపిస్తాయి


మాంగనీసు లోపించినప్పుడు ఆకుల మీద పసుపు రంగు మచ్చలు ఏర్పడి, క్రమంగా అవి గచ్చకాయ రంగుకు లేదా తెల్లగా మారతాయి. ఆకులు క్రిందికి ముడుచుకొని బోర్లించిన గిన్నె లాగా కనిపిస్తాయి. ఆకులపై మాంగనీసు లోప లక్షణాలు జింకు లోప లక్షణాలను పోలి ఉంటాయి. అయితే మాంగనీసు లోపించినప్పుడు ఆకు పరిమాణం తగ్గదు. మాంగనీసు లోపాన్ని సవరించడానికి మాంగనీసు సల్ఫేట్ (0.20 శాతము) ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



**ఇనుము** : సున్నపు పొరలు ఎక్కువగా ఉన్న భూములల్లో, మరియు సాగు నీటిలో బైకార్బోనేట్లు, కార్బోనేటులు అధికంగా వున్నపుడు ఇనుము లోపం ఎక్కువగా కనిపిస్తుంది. లేత ఆకుల్లో ఈనెలు మాత్రం అకుపచ్చగా ఉండి, మిగిలిన భాగమంతా పసుపుగా మారుతుంది. ఆకులన్నీ క్రమంగా పాలిపోయి తెలుపు రంగులోకి మారుతాయి. కాయలు రాలిపోతాయి. 1 శాతం అన్నభేధి ద్రావణాన్ని లోప లక్షణాలు తగ్గే వరకు వారం వ్యవధిలో పిచికారీ చేయాలి.



**మెగ్నీషియం** : కాల్షియం, మెగ్నీషియం, పొటాష్‌ల మధ్య సమతుల్యం లేనపుడు ఈ పోషక లోపం అగుపించ వచ్చు. మెగ్నీషియం లోపం ఉన్నపుడు ప్రధానమైన మధ్య ఈనెకు ఇరువైపులా పసుపు పచ్చని మచ్చలు కన్పిస్తాయి. ఈ మచ్చలు క్రమేపి పెద్దవై కేవలం ప్రధాన ఈనెకు ఇరువైపులా తిరుగబడిన V ఆకారంలో ఆకుపచ్చని ప్రదేశం ఏర్పడుతుంది. ఆ తరువాత ఆకులు రాలిపోతాయి.



ఒక శాతం మెగ్నీషియం సల్ఫేట్ ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు దఫాలు పిచికారీ చేసి ఈ పోషక లోపాన్నిసవరించవచ్చు.

**బోరాన్** : తోటల్లో బోరాన్ లోపం ఏర్పడినప్పుడు కొత్తగా పెరిగే చివరి మొగ్గ ఆకు దెబ్బ తింటుంది. కొమ్మ చివర పెరుగుదల తగ్గిపోయి పక్క కొమ్మలు పెరగడం వల్ల మొక్క గుబురుగా కనిపిస్తుంది. ఆకులు సహజమైన పచ్చ రంగు కోల్పోతాయి. లేత ఆకుల ఈనెలు పసుపు రంగుకి తిరుగుతాయి.



ముదురు ఆకుల ఈనెలు దళసరిగా ఉబ్బి, వంకర తిరిగి పగుళ్లు ఏర్పడుతాయి. పిందెలు రాలిపోతాయి. కాయలో గింజలు ఏర్పడవు. కాయలలో జిగురు వంటి పదార్థం కన్పిస్తుంది. కాయలు పగిలి, నీరు పట్టి కుళ్ళినట్లు కన్పిస్తాయి. లీటరు నీటికి 1గ్రా బోరాక్స్ లేక బోరిక్ ఆమ్లం కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసి బోరాన్ లోపాన్ని సవరించవచ్చు.

**బహుళపోషక లోపాలు** : చాలా సందర్భాలలో, ముఖ్యంగా నేలల్లో సహజంగా అధికంగా సున్నం ఉన్నప్పుడు జింకు, ఇనుము, మాంగనీసు, బోరాన్ లోపాలు ఒకేసారి కన్పిస్తాయి. ఇలాంటి సందర్భాలలో వేర్వేరు పోషక లోపాల్ని ప్రత్యేకంగా గుర్తించడం కష్టం. ఈ లోపాలు అన్నిటినీ సమిష్టిగా 'పల్లాకు తెగులు అని పిలుస్తారు. లేత మొక్కలు సంవత్సరానికి 4-5 సార్లు చిగురిస్తాయి. కావున ఈ సమయంలో పల్లాకు వ్యాధి నివారణకు లీటరు నీటికి జింకు సల్ఫేట్ 5 గ్రా.+మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రా. + మెగ్నీషియం సల్ఫేట్ 2 గ్రా.+ ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రా. + బోరాక్స్ 1 గ్రా. + కాల్షియం / సున్నం 6 గ్రా. + యూరియా 10 గ్రా. మిశ్రమాన్ని సంవత్సరానికి 4 సార్లు (జూన్, జులై, జనవరి, ఫిబ్రవరి) పిచికారీ చేయాలి. విప్పారిన లేత ఆకుల మీద, పిందె బఠాణీ పరిమాణంలో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. సున్నపు నేలల్లోని నిమ్మ తోటల్లో ఇనుప ధాతు లోపం ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకి 20 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ మరియు 2 గ్రా. నిమ్మఉప్పు 10 లీటర్ల నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 దఫాలుగా పిచికారీ చేయాలి.

**డా. కె. ఉమామహేశ్వరి, సీనియర్ శాస్త్రవేత్త, ఐ.సి.సి., గన్నవరం**

**డా. పి. మధుమతి, ప్రధాన శాస్త్రవేత్త, నిమ్మ, చీని పరిశోధనా స్థానం, పెట్లూరు**

# సూక్ష్మ పోషక లోప సవరణతో అద్భుత అరటి



టిష్యూకల్చర్ అరటిలో నాణ్యమైన గెలల దిగుబడికి సమయానుకూలంగా ఆయా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి మేలైన సూక్ష్మ పోషకాల యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే దిగుబడి పెరగడమే కాకుండా పండ్లు పరిమాణం పెరిగి లేత ఆకుపచ్చ రంగులో ఆకర్షణీయంగా తయారై నాణ్యమైన పండ్లు వస్తాయి. ఈ విధంగా వచ్చిన నాణ్యమైన పండ్లను విదేశాలకు కూడా ఎగుమతి చేసుకోవచ్చు.

**1. జింకు ధాతు లోపం :** జింకు ధాతు లోపం వలన లేత ఆకుల ఈనెల వెంబడి తెల్లని చారలుగా ప్రారంభమై ఈనెలు పాలిపోయినట్లు లేదా పసుపు రంగుకు మారుతుంది. ఈనెల వెనుక వైపున ముదురు ఊదా (పర్పుల్) రంగు ఏర్పడుతుంది. జింకు లోపం తీవ్రమైనపుడు అరటి ఎదుగుదల నిలిచిపోతుంది. గెల, పండు పరిమాణం మరియు నాణ్యత తగ్గుతుంది.

**నివారణ:-** మొక్కకు 10 గ్రా జింకు సల్ఫేటు భూమిలో వేయాలి లేదా 2 గ్రా జింకు సల్ఫేటును లీటరు నీటికి జిగురు మందుతో కలిపి ఆకులపై 10 రోజుల వ్యవధితో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేసి లోపాన్ని సవరించవచ్చును.

**2. ఇనుము ధాతు లోపం :** ఇనుము ధాతువు లోపించినప్పుడు అరటి చెట్టు లేత ఆకులు తెలుపు చారలతో ఉంటాయి. లోపం అధికంగా ఉన్నప్పుడు లేత ఆకులు పూర్తిగా తెలుపు లేదా పసుపు రంగుకు మారి క్రమేపీ ఎండిపోతుంది. చెట్టు ఎదుగుదల నిలిచిపోతుంది.

**నివారణ :-** ఫెర్రస్ సల్ఫేట్ (అన్నభేది) 3 గ్రా + నిమ్మ ఉప్పు 1 గ్రా చొప్పున లీటరు నీటికి కలిపి ఆకులు పూర్తిగా తడిచేలా 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేసి ఇనుము ధాతు లోపాన్ని సవరించవచ్చును.

**3. బోరాన్ ధాతు లోపం :** బోరాన్ ధాతు లోపం వలన ఆకుల ఈనెలు ఉబ్బెత్తుగా ఉండి, ఈనెలు బిరుసుగాను, పెళుసుగాను ఉంటాయి. ఆకులపై నిలువుగా (పెద్ద ఈనెకు సమాంతరంగా) చారలు ఏర్పడతాయి. ఆకుల తొడిమలు కురుచబారి, మొవ్వులో గుబురుగా ఏర్పడతాయి. చెట్టు ఎదుగుదల తగ్గుతుంది. గెలలు చిన్నవిగా వుండి మొవ్వులో నుండి పూర్తిగా బయటికి రాలేవు. కాయలపై నిలువు పగుళ్ళు ఏర్పడతాయి. పండు పరిమాణం తగ్గి, నాణ్యత కోల్పోతుంది.

**నివారణ :-** బొరాక్స్ లేదా బోరిక్ ఆమ్లం 1 గ్రా. లీటరు నీటికి కలిపి ఆకుల పై 10 రోజుల వ్యవధితో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేసి బోరాన్ లోపాన్ని నివారించవచ్చును.

**4. మాంగనీసు ధాతు లోపం :** మాంగనీసు ధాతు లోపం వల్ల ముదురు ఆకులపై నిర్ణీత ఆకారం లేని పసుపురంగు మచ్చలు ఏర్పడతాయి. రోజులు గడిచినకొద్దీ, పసుపురంగు మచ్చల మధ్యలో ఎండిపోవును. లోపము తీవ్రమైనపుడు ఆకులు పూర్తిగ

జింకులోపం



ఇనుములోపం



బోరాన్‌లోపం



మాంగనీసులోపం



ఎండిపోవును. పిలకల లేత ఆకులు ఆకుపచ్చని చారలతో కూడిన తెలుపు వర్ణము కలిగి ఉండును. లోపము తీవ్రమైనపుడు తెలుపు రంగు కలిగిన లేత ఆకులు ఎండిపోతాయి. పిలకలు మరియు తల్లి చెట్టు ఎదుగుదల నిలిచిపోతుంది.

**నివారణ:-** మాంగనీసు సల్ఫేటు 2 గ్రా? లీటరు నీటికి కలిపి ఆకులపై పదిరోజుల వ్యవధితో 2సార్లు పిచికారి చేసి మాంగనీసు లోపాన్ని నివారించవచ్చును.

**5. కాల్షియం ధాతు లోపం :** అరటిలో కాల్షియం ధాతువు లోపించినపుడు, ఆకులో మధ్య ఈనె మాత్రమే ఉంటుంది. తాత్కాలికంగా మూడు లేక నాలుగు ఆకులు ఈ విధముగా వచ్చి ఆ తరువాత మామూలు ఆకులు వస్తాయి. ప్రత్యేక నివారణ చర్యలు చేపట్టనవసరంలేదు.

**6. మెగ్నీషియం ధాతు లోపం :** ఆకుల మధ్య ఈనె వెంబడి పసుపు రంగుకు మారి మిగిలిన ఆకుభాగం పాలిపోయిన పచ్చదనం లేదా తెలుపుగా ఉంటుంది. కాండము, ఆకులు, ఆకుల తొడిమలపై నీలం రంగు పొడ ఏర్పడుతుంది. ఆకులు, ఆకుల తొడిమలు కురుచబారి, మొవ్వులో గుబురుగా ఏర్పడుతుంది. చెట్టు ఎదుగుదల నిలిచిపోతుంది.

**నివారణ:-** మెగ్నీషియం సల్ఫేట్ 3 గ్రా? ఒక లీటరు నీటికి కలిపి పదిరోజుల వ్యవధితో 2-3 సార్లు పిచికారి చేసి మెగ్నీషియం ధాతు లోపాన్ని సవరించవచ్చు.

**7. గంధకం ధాతు లోపం :** కొత్తగా వచ్చు లేత ఆకులు బాగా లేత ఆకుపచ్చ రంగులో ఉండి, ఆకుపచ్చ రంగుకు మారుటకు ఎక్కు సమయం తీసుకొనును.

**నివారణ :-** గంధకం కలిగిన ఎరువులను అందించుట లేదా పిచికారి చేసి గంధకం ధాతు లోపా సవరించవచ్చును.

**8. రాగి ధాతు లోపం :** ఈ ధాతు లోప లక్షణాలు అన్ని ఆకులపై కనిపిస్తాయి. ఆకుల పాలిపోయిన ఆకుపచ్చ రంగులో మధ్య ఈనె బాగా వంగి ఉండటం వలన అరటిచెట్టు గొడుగు ఆకారంలో కనిపిస్తుంది. గెల దిగుబడి తగ్గుతుంది. చీడపీడలకు చెట్టు త్వరగా లొంగిపోతుంది. ఈ ధాతు లోపం బాగా తీవ్రంగా ఉన్నప్పుడు మొవ్వు ఆకు సగం విచ్చుకోదు.

**నివారణ:-** రాగి ధాతు సంబంధ మందులను ఆకులపై పిచికారి చేయాలి లేదా ఒక కేజీ కాపర్ సల్ఫేట్ ఒక హెక్టారు భూమిలో కలియదున్నాలి.

**సూక్ష్మపోషకాల పిచికారీ :** 75 గ్రాముల సూక్ష్మపోషక మిశ్రమం (అర్క బనానా స్పెషల్) + ఒక నిమ్మపండు రసం + ఒక షాంపూ పాకెట్‌ను 15 లీటర్ల శుభ్రమైన నీటిలో బాగా కరిగించి మిశ్రమం చేయాలి. ఈ విధంగా తయారుచేసిన మిశ్రమాన్ని టిష్యూ కల్చర్ అరటి పిలకలు నాటిన 15వ రోజు పై ద్రావణాన్ని ప్రతి మొక్కకు 250 మి.లీ. చొప్పున మొక్క చుట్టూ పాదులో పోయాలి. అదే

అరటి కందలు నాటిన 45 రోజుల తరువాత వేయాలి. అదేవిధంగా ద్రావణాన్ని మొక్క నాటిన 5వ నెల నుండి 30 రోజుల వ్యవధిలో 8వ నెల వరకు మొక్క మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. (అంటే 4 సార్లు పిచికార్లు చేయాలి. మొక్కలు గెలల మీద ఉ న్నట్లయితే గెల వచ్చిన 30 రోజులకు, 60 రోజులకొకసారి ఆకులపై, గెలలపైన ఈ సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. పిచికారీ ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు, అదేవిధంగా సాయంత్రం 4 గంటల నుండి చేయాలి. ఈ సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని ఇతర పురుగు, శిలీంధ్ర నాశక మందులలో కలిపి పిచికారీ చేసుకోవచ్చు.



**డా. కె. వేంకట సుబ్బయ్య, డా. వేంకట సతీష్ కూచి, జి. శాలి రాజు, డా. ఎం. రాఘవేంద్రరెడ్డి , డా. ఎ. దేవీవరప్రసాద్ రెడ్డి, డా. వైయస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం - కృషి విజ్ఞాన కేంద్రం. వెంకట రామన్నగూడెం**



# త్వరగా పెరిగే పొట్ల

మన రాష్ట్రం లో సాగు చేస్తున్న ముఖ్యమైన పందిటి కూరగాయలలో పొట్లకాయ ఒకటి. ఇది త్వరగా పెరిగే వార్షిక తీగ జాతి రకము. దీని కాయలు రకాని బట్టి 30 సెం.మీ. నుండి 200 సెం.మీ. వరకూ ఉంటాయి.

**వాతావరణం :** తేమతో కూడిన వాతావరణం పొట్ల సాగుకు అనుకూలం. ఉష్ణోగ్రత 25-30 సెంటిగ్రేడ్స్ ఉంటె తీగ పెరుగుదల బాగా ఉండి పూత, పిందె బాగా పడుతుంది.

పొట్ల సాగుకు నీటిని నిలుపుకొను బంకమట్టి నేలలు, ఉదజని సూచిక 6-7 ఉన్న ఒండ్రు మట్టి నేలలు అనుకూలం.

**రకాలు**

**శ్వేత:** ఈ రకం మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో పండించడానికి అనుకూలము. దీని కాయలు 150-200 సెంటీ మీటర్లు పొడవు కలిగి ఉంటాయి. ఇది అదిక దిగుబడనిచ్చే రకం. దీని పంట కాలం 125-130 రోజులు. ఎకరాకు 11-12 టన్నుల దిగుబడిని ఇస్తుంది. వేసవి పంటకు కూడా అనుకూలమైన రకము.

**కో 1** : ఈ రకము కాయలు 160-180 సెంటీమీటర్ల పొడవు ఉండి తెల్లచారలతో ముదురు ఆకుపచ్చ రంగు కలిగి ఉంటాయి. పంట కాలం 135 రోజులు, దిగుబడి సుమారుగా ఎకరాకు 7 టన్నులు

**కో 2** : ఈ రకాన్ని పందిరి అవసరం లేకుండా పండించవచ్చు కాయలు 30-35 సెంటీమీటర్ల పొడవు ఉండి లావుగా లేత ఆకుపచ్చ రంగు ఉండి చారలు లేకుండా ఉంటాయి. పంటకాలము 120-130 రోజులు, దిగుబడి సుమారుగా 10-12 టన్నులు ఎకరాకు ఇస్తుంది. ఇవేకాక హైబ్రిడ్ రకాలు కూడా మనుగుడలో ఉన్నాయి.

**నేల తయారీ** : పొలాన్ని 3-4 సార్లు బాగా దున్ని ఆఖరి దిక్కులో సుమారు ఎకరాకు 6-8 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. 60×80 సెంటీమీటర్ల వెడల్పు కాలువలు 2 మీటర్ల ఎడంతో వేసుకోవాలి. కాలువలో పాదుకీ పాదుకీ మధ్య 1×1.5 మీటర్ల దూరం, ఎడం ఉండేటట్లు విత్తుకోవాలి.

**విత్తన మోతాదు :** ఎకరాకు 0.6- 0.8 కిలోల విత్తనం అవసరమవుతుంది.

**విత్తన శుద్ధి** : ఇమిడాక్లోప్రిడ్ 5గ్రా. 1 కిలో విత్తనానికి పట్టించి ఆ తరువాత ట్రైకోడెర్మా విరిడి 5 గ్రా. లేదా 3 గ్రాముల థైరం లేదా కాప్టాన్ మందుతో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి. ఒక్కో పాదుకి 3 - 5 విత్తనాలను 2-3 సెంటీమీటర్ల లోతులో విత్తుకోవాలి. విత్తిన 8-10 రోజులలో విత్తనాలు మొలకెత్తుతాయి. విత్తనాలను జూన్-జూలై, డిసెంబర్-జనవరి వరకు విత్తుకోవచ్చు. బలమైన 2 మొక్కలను ఉంచి మిగిలిన వాటిని తీసివేయాలి వర్షాధార పంటగా అయితే పంట త్వరగా చేతికి రావడానికి మే నెలలో 2వారంలో 15-20 సెంటీమీటర్ల కొలతలు గల పాలిథిన్ సంచుల్లో 2-3 విత్తనాలు చొప్పున ఎత్తుకొని 15-20 రోజులు పెరిగిన తరువాత రెండు ఆకుల దశల్లో అదును చూసి పొలంలో నాటడం మంచిది.





**నీటి యాజమాన్యం** : గింజ విత్తే ముందు పొలంలో నీరు పెట్టాలి ఆ తరువాత 3, 4 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి మొలకెత్తిన తర్వాత వారానికి ఒకసారి పాదులలో నీరు పారించాలి. వేసవి పంటకు 4,5 రోజులకు ఒకసారి నీరు ఇవ్వాలి.

**ఎరువుల యాజమాన్యం** : ముందుగా ఎకరాకు 24-32 కిలోల భాస్వరం 20-24 కిలోల పొటాష్‌ను బాగా కలిపి అన్ని గుంటలకు సమానంగా నింపాలి. నత్రజని 32-40కిలోలు 2 సమభాగాలుగా చేసి మొదటి భాగం విత్తిన లేదా మొక్క నాటిన 25 రోజులకు రెండో భాగం పూత, పిందే సమయంలో అంటే విత్తిన 45 రోజులకు వెయ్యాలి.

**అంతరకృషి** : కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. మొక్కలు బలంగా పెరగడానికి 1-2 సార్లు పాదుల చుట్టూ తేలిగ్గా మట్టిని గుల్ల చెయ్యాలి. పాదులను పందిరి పైకి పాకించాలి. 3,4 రోజుల వయసు గల కాయలను పురి కొసకు రాయి కట్టి వేలాడదీయాలి, ఇలా చేయడం వలన కాయ నిటారుగా పెరుగుతుంది. లేనిచో కాయలు చుట్టుకుని పోతాయి.

**కలుపు నివారణ** : పెండిమిథాలిన్ ఎకరాకు 1.2 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గానీ మరుసటి రోజు గానీ పిచికారి



చేయాలి. విత్తిన 30 రోజులకు గొర్రు లేదా గుంటకతో అంతర కృషి చేయాలి, వర్షాకాలంలో మట్టిని ఎగదోసి బోదెలు సరి చేయాలి



**సస్యరక్షణ** :

1. ఎండాకాలంలో లోతుగా దుక్కులు దున్నుకోవాలి,
2. పంట మార్పిడి చెయ్యాలి (జొన్న, మొక్కజొన్నతో)
3. కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి,
4. పెరుగుదల దశ నుండి పూత వచ్చేవరకు 5% వేప గింజల కషాయాన్ని 15 రోజుల వ్యవధితో పిచికారీ చేయాలి,
5. పెంకు పురుగుల నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి,
6. నులిపురుగులు ఆశించకుండా పర్పూరిసీలియం + ట్రైకోడెర్మా ఒక కిలో చొప్పున పశువుల ఎరువు 90 కిలోలు, వేపపిండి 10 కిలోలు అభివృద్ధి చేసి మొక్కల పాదులలో వేసుకోవాలి.
7. రసం పీల్చే పురుగులను సకాలంలో అరికట్టుకొని వైరస్ తెగుళ్ల వ్యాపించకుండా అరికట్టుకోవచ్చు,
8. తీగజాతి పంటలపై గంధకం సంబంధిత మందులను వాడరాదు, దీనివలన ఆకులు మాడిపోతాయి.

**డా. కె. వెంకటసుబ్బయ్య, డా కూచి వెంకట సతీష్, శాలిరాజు, డా. ఎం. రాఘవేంద్ర రెడ్డి, డా. దేవి వరప్రసాద్ రెడ్డి, డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం, వెంకటరామన్న గూడెం**

# పుట్టగొడుగులు - పోషకాల గనులు



ఆంధ్ర ప్రదేశ్ లో ముఖ్యముగా నాలుగు రకాల పుట్టగొడుగు రకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి, 1.పాల పుట్టగొడుగు, 2. బటన్ పుట్టగొడుగు, 3. వరిగడ్డి పుట్టగొడుగు, 4. ముత్యపు చిప్ప పుట్ట గొడుగు. మన రాష్ట్రములో పాల పుట్టగొడుగుల పెంపకానికి అధిక అవకాశాలు ఉన్నాయి.

**కావలసిన సామాగ్రి :** గదులు-2, వరిగడ్డి, చెక్కతో చేసిన స్టాండు అలమరా, పాలిథిన్ సంచులు, స్పాన్ (విత్తనం), డెట్టాల్, స్ట్రెయర్, చాకు, రబ్బర్ బాండ్స్, ఫార్మాల్డిహైడ్, కార్బండిజమ్, నీళ్ళడ్రమ్ము.

**తయారీ విధానం** : వరిగడ్డిని 3-5 సెం.మీ, పొడవుతో ముక్కలు ముక్కలుగా చేసిన తరువాత, గడ్డి ముక్కలను 12గం. లు నీటిలో ముంచి నానబెట్టి మరుసటి రోజున బాగా మరుగుతున్న వేడినీటి ద్వారా లేదా రసాయనిక విధానంలో శుద్ధి చేసుకోవాలి.

**గదులను శుభ్ర పరచటం :** వీటి పెంపకానికి ముందు 1 లేదా 2 గదులను ఏర్పాటు చేసుకోవాలి, ఏర్పాటు చేసుకున్న గదులను బాగా శుభ్రం చేసి క్రిమి రహితంగా చేయాలి, ముందుగా ఏర్పాటు చేసుకున్న గదులలోని దుమ్ము ధూళి తుడిచి వేయాలి, తరువాత గది యొక్క నేలను సర్ఫ్ తో గాని లేదా డెట్టాల్‌తో గాని బాగా కడగాలి, తర్వాత ఒక 2 లీటర్ల నీటిలో 3% ఫార్మాలిన్, 2 చిటికెల కార్బండిజమ్ వేసి ఆ నీళ్లను గదిలోపలి భాగంలో మొత్తం స్ప్రే చేయాలి, అలా ఒక రోజు వరకు ఉంచాలి. దాని వలన గదుల్లో ఉన్నటువంటి సూక్ష్మజీవులు మొత్తం చనిపోతాయి. ఇలా చనిపోవడం వల్ల బెడ్లు చెడిపోకుండా, వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చు.

**వరిగడ్డిని ఎంచుకోవడం** : పుట్టగొడుగుల పెంపకం మొత్తం కూడా వరిగడ్డి పైనే ఆధారపడి ఉంటుంది, కాబట్టి వరిగడ్డిని ఎంచుకునే విధానంలో చాలా జాగ్రత్తలు పాటించాలి నాణ్యమైన ఒక సంవత్సరంలోపు గడ్డిని ఎంచుకోవాలి. ఒకసారి తడిచిన గడ్డిని, నల్లగా ఉన్న గడ్డిని ఎంచుకోరాదు. వరిగడ్డి ఎప్పుడు తెల్లగా గలగలమంటూ బాగా ఎండి ఉండాలి. పంటపొలంలో వర్షాల కారణంగా తడిచిపోయిన వరిగడ్డిని వాడరాదు.

**వరిగడ్డిని శుద్ధి చేయడం** : ముందుగా ఎంచుకున్న నాణ్యమైన వరిగడ్డిని చిన్న చిన్న ముక్కలుగా 3-5 సెం.మీ సైజులో కట్ చేసుకుని పెట్టుకోవాలి. వాటర్ డ్రమ్మును శుభ్రంగా కడగాలి కడిగిన డ్రమ్ములు సగానికి పైగా నీళ్లు పోయాలి దానిలో 350 మి.లీ. ఫార్మలిన్ ద్రావణంలో 2 టీ స్పూన్ల కార్బండిజమ్ లో వేసి బాగా కలపాలి. అలా కలిపిన నీళ్లలో 12 - 16 గంటలు ఉంచి శుద్ధి చేయాలి. ఈ గడ్డిని బయటకు తీసి అరగంటసేపు చల్లని ప్రదేశంలో ఆరబెట్టాలి లేదా రసాయనాలు లేకుండా 10 కేజీల గడ్డిని 100 లీటర్ల నీటిలో రోజంతా నానబెట్టి మరుసటి రోజు 100 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద అర గంటసేపు ఉడకబెట్టి శుద్ధి చేసుకోవాలి అలా చేసుకున్న తర్వాత 100 గేజ్ మందంగల 12 × 18 అంగుళాలు 14 × 24 అంగుళాల సైజుల గల కవర్లు తీసుకొని వాటికి 12 - 15 మిల్లీమీటర్ సైజు గల రంధ్రాలు చెయ్యాలి. ఈ కవర్లలో 5 సెంటీమీటర్ల మందం



వరకు గడ్డి వేసి స్పాన్ గడ్డి అంచుల చుట్టూ వేయాలి. ఇలా 5 లేదా 8 వరుసల శుద్ధి చేసిన స్పాన్ వేసి ఉపరితలం గడ్డి ముక్కలపై కొంచెం విత్తనాన్ని చల్లాలి చీకటి గదిలో తేమ 80 - 90%, ఉష్ణోగ్రత 30 - 35 డిగ్రీల సెల్సియస్, గాలి సరఫరా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి కేజీ స్పాన్‌కి 10 బ్యాగులను తయారు చేసుకొన వచ్చును, 2 - 3 వారాలలో గడ్డి ముక్కలపై తెల్లని శిలీంధ్రం దట్టముగా వ్యాపిస్తుంది.

**కేసింగ్ కోసం :** చెరువు మట్టిని రాళ్లు రప్పలు లేకుండా మెత్తగా అయ్యేలా చేసుకోవాలి. ఈ మట్టిని 1టీ స్పూన్ కార్బండిజమ్ వేసి కలిపి ప్రక్కన పెట్టుకోవాలి. తరువాత 75 కేజీల మెత్తగా చేసిన నల్ల మట్టిలో 3 కేజీల చాక్‌పౌడర్ వేసి బాగా కలపాలి. ఈ విధంగా మిశ్రమం మొత్తం కూడా కలపాలి. ఈ మట్టిని సంచుల్లో నింపి మూతి కట్టి ఒక పక్కన నిల్వ చేసుకోవాలి. ఈ విధంగా వారం రోజుల తర్వాత మట్టిని కేసింగ్‌కు ఉపయోగించాలి.

**బెడ్స్‌ను కేసింగ్ చేయుట :** 30 రోజుల తరువాత తయారైన బెడ్స్‌ని సగానికి కట్‌చేసి ఒక అంగుళం నొక్కి ముందుగా సిద్ధం చేసుకున్న మట్టిని ఒక అంగుళం మేర పెట్టాలి. ఈ విధంగా 24 గంటల తర్వాత నుండి బెడ్స్ పై నీటిని చల్లాలి. ప్రతి 3-4 రోజులకు ఒకసారి పంట వస్తుంది. అధిక దిగుబడిని ఇచ్చే పాల పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు సంవత్సరం పొడవునా నిరంతరాయంగా మంచి ఆదాయాన్ని పొందవచ్చును. అంతేగాక తమకు అందుబాటులో ఉన్న వనరులతో సమ్మిళితమై తక్కువ పెట్టుబడితోనే ఈ పుట్టగొడుగుల సాగును చేపట్టి నాణ్యమైన, పోషకాలు కలిగిన ప్రోటీన్ ఆహారాన్ని స్వీకరించవచ్చు.

## ఇవీ ఆరోగ్య ప్రయోజనాలు

- ★ బరువు తగ్గించుకొనుటలో ఉపయోగపడుతుంది
- ★ అధిక రక్త పోటును అదుపులో ఉంచుతుంది
- ★ రొమ్ము కాన్సర్, ప్రోస్టేట్ గ్రంధి తగ్గుదలకు సహాయ పడుతుంది.
- ★ వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తుంది
- ★ చర్మ వ్యాధులైన గజ్జి, తామర, చేతులు మండడం వంటి వాటిని తగ్గించుటలో ఉపయోగపడుతుంది.
- ★ పెదవుల పగుళ్ళను అరికడుతుంది.
- ★ జీవక్రియ సజావుగా సాగడానికి తోడ్పడుతుంది.
- ★ పచ్చ కామెర్లు, రక్త ప్రసరణ వంటి వ్యాధులు నయమవుతాయి.
- ★ ఖనిజలవణాలు, సున్నం, భాస్వరం, పొటాషియం , రాగి, ఇనుము సమృద్ధిగా ఉన్నందున, ఎముకల పటిష్టతకు కంటిచూపు మెరుగుకు తోడ్పడుతుంది.
- ★ అధిక పీచు ఉండడం వలన మలబద్దకాన్ని తగ్గిస్తుంది.



**డా. ప్రభావతి, గృహ విజ్ఞాన శాస్త్రం గరికపాడు, డా.బి. వెంకటేశ్వర్లు, ఐసీసీ గన్నవరం. డా. టి. ప్రశాంత్ కుమార్ , వ్యవసాయ కళాశాల బాపట్ల**



# అంతర పంటలు.. అధిక ఆదాయ మార్గాలు

అంతర పంటలు..అధిక లాభాల సాగు

మనకున్న సహజ వనరులను సమర్ధంగా వినియోగించుకుంటే పంటల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు. పరిమిత సాగుభూమిలో అంతర పంటల సాగుతో పంట ఉత్పత్తులను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరముంది. మన రాష్ట్రంలో అదిక విస్తీర్ణంలో 750 మిమీ నుంచి 1100 మిమీ వర్షపాతం కురుస్తుంది. సరైన అవగాహనతో, నేర్పుతో రెండు లేదా మూడు పంటలను ఒకేసారి దిగ్విజయంగా సాగు చేయవచ్చు. రెండు లేదా మూడు పంటలను ఒక నిర్ధిష్టమైన నిష్పత్తిలో సాగు చేస్తే వాటిని అంతర పంటలు అంటారు.

అంతర పంటల సాగు వల్ల పంటల సాగు వల్ల మిత్ర పురుగులయిన సాలెపురుగులుకు, ట్రైకోగ్రామాలకు సానుకూల వాతావరణం వృద్ధి చెందుతుంది. ఒకే పంటకు ఆశించే కీటకాలు ఇంకోపంటకు ఆశించవు. అంతేకాక వ్యాధి నిరోధక శక్తి గల పంటలుగా తోడ్పడి మిగతా పంటలకు రోగాలు, కీటకాల నుంచి రక్షిస్తాయని తేలింది. కంది, పత్తిలాంటి పైర్లలో తొలిదశలో మొక్కల పెరుగుదల చాలా నెమ్మదిగా ఉంటుంది. అప్పుడు వరుసల మధ్య స్థలం ఖాళీగా ఉండడం వల్ల కలుపు బెడద తద్వారా చీడపీడల బెడద ఉంటుంది. తక్కువ కాలపరిమితి గల అపరాలు, తృణధాన్యాలు, వేరుశనగలను అంతర పంటలుగా విత్తి ఫలసాయం పొందవచ్చు.

భూసారాన్ని సక్రమంగా వినియోగించడానికి, కలుపు మొక్కల బెడద తగ్గించడానికి ప్రధాన పంటలతో పాటు అంతర పంటలను ఒక క్రమ పద్ధతిలోమాత్రమే విత్తుకోవాలి.

అంతర పంటలతో అనేక ప్రయోజనాలు: అంతర పంటల వల్ల పురుగుల పై వచ్చే బదనికలు పంటల పై దాడి చేస్తే మిత్ర సూక్ష్మ జీవులు పెరుగుతాయి. అలాగే ఒక పంట దెబ్బతిన్నా ఒక పంట మిగులుతుంది.

అంతర పంటల వల్ల కీటకాల ప్రవర్తనలో మార్పులు వచ్చి వాటి నియంత్రణకు తోడ్పడతాయి.

అంతరపంటల మొక్కలు ఏపుగా పెరగడం వల్ల కీటకాలకు కూడా అవరోధాలు ఏర్పడతాయి.

అంతర పంటల వల్ల పొడవు, పొట్టి మొక్కలను వరుస వదిలి వరుస నాటడం వల్ల పొలం సరిహద్దుల్లో పొడవు పెరిగే మొక్కలు పెంచడం వల్ల వివిధ కీటకాలకు అడ్డుగోడలుగా నిలిచి లోపలున్న పంటలకు చొచ్చుకుపోవు.

అంతర పంటల్లోని పుష్పించే మొక్కలు, మిత్ర పురుగులకు ఆవాసాలు, ప్రాణాధారాలు.

పోషక పదార్థాలు వినియోగం పెంపొందించవచ్చు.

ప్రధాన పంటల నాణ్యత పెంచవచ్చు.


నేలకోత అరికట్టవచ్చును. కలుపు మొక్కలు రాకుండా నివారించవచ్చు.

| ప్రధాన పంట | అంతర పంట | అదుపుచేసే చీడపీడలు |
|---|---|---|
| 1 జొన్న/సజ్జ | కంది | ఎండుతెగులు |
| 2 మొక్కజొన్న | చిక్కుడు, దోస, చిలగడదుంప | రసంపీల్చేపురుగులు/పెంకుపురుగులు/ బొంత పురుగులు/ కత్తెర లద్దె పురుగు |
| 3 పెసర/మినుము | కంది/ మొక్కజొన్న | ఎండుతెగులు/ వేరుకుళ్లు |
| 4 సోయాచిక్కుడు | కంది/ మొక్కజొన్న | శనగపచ్చ పురుగు |
| 6 అలసంద | జొన్న | ఆకుతినే పెంకు పురుగులు |
| 7 కంది | చిరుధాన్యాలు/ ఇతర పప్పుధాన్యాలు | ఎండు తెగులు/ కాయ తొలిచే పురుగు |
| 8 శనగ | చిరుధాన్యాలు/ధనియాలు/ ఆవాలు | ఆస్కోఖయిట ఎండు తెగులు/ శనగపచ్చ పురుగు |
| 9 వేరుశనగ | మొక్కజొన్న/ సజ్జ/ జొన్న మొక్కజొన్న<br>కంది/సోయా చిక్కుడు<br>అలసంద/దోస | కంకి తినే పిల్లపురుగు<br>ఆకుముడత<br>ఎర్ర గొంగళిపురుగు/పొగాకు లద్దె పురుగు |
| 10 ఆముదం | వేరుశనగ | ఎండు తెగులు/పొగాకు లద్దె పురుగు |
| 11 పొద్దుతిరుగుడు | పత్తి/బంతి | శనగపచ్చ పురుగు |
| 12 పత్తి | మొక్కజొన్న/ జొన్న, సజ్జ<br>మొక్కజొన్న/ వేరుశనగ<br>మినుము/ అలసంద/ పెసర/ కంది/<br>సోయా చిక్కుడు | ఎండుతెగులు<br>శనగపచ్చపురుగు<br>ఎండు తెగులు, రసం పీల్చేపురుగులు<br>పేనుబంక/ తామరపురుగు |
| 13మిరప | అలసంద/అపరాలు | శనగపచ్చ పురుగు/ రసంపీల్చే పురుగు |
| 14 టమాట | బొబ్బర్లు/ క్యాబేజి, మొక్కజొన్న<br>ముల్లంగి | రసంపీల్చే పురుగు<br>పెంకు పురుగులు |
| 15 వంగ | బెండ/ మొక్కజొన్న<br>అలసంద/ ధనియాలు<br>అపరాలు | ఎండు తెగులు<br>కొమ్మకాయ తొలిచేపురుగులు<br>ఎండు తెగులు/ రసంపీల్చే పురుగు |
| 16 దోస | మొక్కజొన్న / జొన్న/సజ్జ/ అపరాలు | పెంకుపురుగులు/ ఎండు తెగులు/ రసంపీల్చే పురుగు |
| 17 క్యాబేజి | టమాట/ ధనియాలు/ ఆవాలు<br>ముల్లంగి/ చిక్కుడు/ అపరాలు/ బంతి | డైమండ్ బ్యాక్ మాత్/ క్యాబేజి తల తొలిచే పురుగు/పెంకుపురుగు<br>పేనుబంక పురుగులు/ రసంపీల్చే పురుగులు/ శనగపచ్చ పురుగు |
| 18 వంగ, టమాట, | బంతి/ అపరాలు, బెండ,<br>సోయాచిక్కుడు | నులి పురుగు/ రసంపీల్చే పురుగులు |
| 19 కాలీఫ్లవర్ | ఆవాలు | మొక్కతొలిచే పురుగులు |

అంతర పంటల వల్ల సహజ వనరులైన నేల, నీరు, సూర్యరశ్మి పంటల మధ్య ఉన్న ప్రదేశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రధాన పంటలపై వచ్చే చీడపీడలను అదుపు చేసి సాగు ఖర్చు తగ్గించవచ్చు. రైతు తన పొలం నుండి ఒకేసారి ఎక్కువ డిగుబడి పొందవచ్చు.



డా.బి.వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త, ఐసిసి, గన్నవరం,
కె. మాధవి, వ్యవసాయ కళాశాల, బాపట్ల



## విజయగాథ

# వినూత్న సాగుకు పట్టం

ఆమె పేరుకు తగట్టే విద్యాధికురాలు..కొన్నేళ్ళు వివిధ ఉద్యోగాలు చేశారు.. అయినప్పటికి వ్యవసాయంపై మక్కువతో కొంగు బిగించి..కాడి పట్టి పొలంలో దిగారు.. అద్భుత పంట దిగుబడులు సాధించారు.. ఆ కృషికి గాను రాష్ట్ర స్థాయి పురస్కారం పొందారు.. ఎందరో అతివలకు ఆదర్శంగా నిలిచారు.. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన వ్యవసాయ సలహా మండలిలో జిల్లాకే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.. ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంతాడపల్లి గ్రామానికి చెందిన ఎం. సరస్వతి..

బిఏ, బీఈడి చదివిన సరస్వతి... ఆరేళ్ళపాటు సీఆర్పిగా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు... చాలీ చాలని జీతం.. సంతృప్తి ఇవ్వని ఉద్యోగంతో తీవ్ర ఆలోచనలో పడ్డారు.... సొంతంగా వ్యవసాయం చేస్తే.. తానే పది మందికి ఉపాధి కల్పించవచ్చు కదా.. పైగా ఉన్న ఊళ్ళో ఉండొచ్చనే ఆశతో సేద్యం చేపట్టారు... అప్పటి వరకు ఒక మూస పద్ధతిలో సాగుతున్న వ్యవసాయాన్ని సమూలంగా మార్చారు.. తమకున్న పది ఎకరాల పొలంలో వరి స్థానిక రకాలను సాగు చేసేవారు.. నారు వేయడానికి కుంచం (నాలుగు కిలోలు) లెక్కన 70 నుంచి 120 కుంచాల విత్తనాలు నారు పోసేవారు..నాట్లకు 30 మంది, ఊడ్పులకు కనీసం 70 మంది కూలీలు అవసరమయ్యేవారు.. సహజంగానే ఖర్చులు విపరీతంగా పెరిగిపోయేవి.. డిగుబడి ఎంత వచ్చినా గిట్టుబాటు అయ్యేది కాదు.. ఇదీ సరస్వతి నాగలి పట్టక ముందు పరిస్థితి...

**వినూత్న పద్ధతులు :** ఆమె శ్రీవరి సాగు ఆరంభించి విత్తనాలను 20 కుంచాలకు తగ్గించగలిగారు...నాట్లు, కలుపు, ఊడ్పులు అన్ని స్వయంగా చూసుకున్నారు....నారు పోయడానికి పది మంది, ఊడ్పులకు 30 మంది కూలీలు సరిపోయారు..... విత్తనాలు, కూలీల ఖర్చు గణనీయంగా తగ్గింది.. దిగుబడి పెరిగింది.. ఆమె కష్టం ఫలించింది.. అంతకు ముందుకన్నా ధాన్యం దిగుబడి ఎక్కువ సాధిస్తున్నారు. అంతే కాదు అత్తవారి ఊరైన జీకే వీధి మండలంలో ఉన్న 30 ఎకరాల్లో మిరియాలు, పసుపు, కాఫీ సాగును ఆమె పర్యవేక్షిస్తున్నారు...తమ సొంత ఊళ్లో కూరగాయలు కూడా పండిస్తున్నారు..ఆరేళ్ళుగా వ్యవసాయంలో ఆమె చేస్తున్న కృషికి గ్రామ, డివిజన్, జిల్లా స్థాయి ఆదర్శ రైతు పురస్కారాలు అందుకున్నారు. 2022 లో ఎన్.జి.రంగా వ్యవసాయ విద్యాలయం ఉపకులపతి నుంచి ఆదర్శ రైతుగా పురస్కారం, నగదు బహుమతి అందుకున్నారు.

**భర్త తోడుగా :** భర్త వెంకటేశ్వర పాత్రుడు తన వెన్నంటి నడిపిస్తున్నారని సరస్వతి ఆనందంగా చెబుతారు. ఆరేళ్ళుగా వ్యవసాయంలో గడించిన అనుభవం, జిల్లా రైతులు, పంటల పరిస్థితులపై పూర్తి అవగాహన ఉండడంతో ఆమెను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలికి సభ్యురాలిగా నియమించింది.. ఆ అవకాశాన్ని సరస్వతి సద్వినియోగం చేసుకుని ప్రతీ సమావేశానికి క్రమం తప్పకుండా హాజరై పంటల ప్రణాళికలో భాగస్వాములు అయ్యారు. ఇటీవల సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన తొలి రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొని తమ జిల్లా సమస్యలు ప్రస్తావించి సభికుల మన్ననలు అందుకున్నారు.



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు

1) రైతు పేరు: కొర్రా శంకర నాయక్, గ్రామం : తడ, మండలం: ఓర్వకల్లు, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్: 8790177670.

ప్ర: ప్రత్తిలో ఆకులు ఎండిపోతున్నాయి, నివారణ తెలుపగలరు?

జ: ప్రత్తిలో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. + స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా. చొప్పున ప్రతి 10 లీటర్ల నీటికి కలిపి 7 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

2) రైతుపేరు: బొడ్డ అశోక్, గ్రామం: ఎల్లయ్య పాలెం, మండలం: కొడవలూరు, జిల్లా: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు, ఫోన్ నెంబర్: 9493355315.

ప్ర: మాగాణి వరిలో గడ్డిజాతి మరియు వెడల్పాటి ఆకు కలుపును ఎలా నివారించాలో తెలుపగలరు?

జ: మాగాణి వరిలో గడ్డిజాతి మరియు వెడల్పాటి ఆకు కలుపు నివారణకు నారు నాటిన 3-5 రోజుల లోపు ఎకరానికి 4 కిలోల 2,4 డి ఇథైల్ ఎస్టరు 4% గుళికలు మరియు 4 కిలోల బ్యూటాక్లోర్ 5% గుళికలు, 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పలుచగా నీరు పెట్టి సమానంగా చల్లాలి.

3) రైతుపేరు: లింగారెడ్డి రామకోటిరెడ్డి, గ్రామం : ఉలవపాడు, మండలం: ఉలవపాడు, జిల్లా: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు, ఫోన్ నెంబర్: 9494904909

ప్ర: వేరుశనగ వేసి 3-7 రోజులు అవుతోంది కలుపు నివారణ తెలుపగలరు ?

జ: వేరుశనగలో విత్తనం నాటిన 20 రోజులలోపు గడ్డి జాతి మరియు వెడల్పాకు కలుపు నివారణకు ఇమజితాఫిర్ 300 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి ఎకరము పైరులో పిచికారీ చేసుకోవాలి.

4) రైతు పేరు : నాగరాజు, గ్రామం : నర్లపురం, మండలం: వెల్దుర్తి, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్ : 9493903840.

ప్ర: అండు కొర్రలు వేయాలని అనుకుంటున్నాను, విత్తనం ఎంత మోతాదులో వేసుకోవచ్చు ?

జ: అండు కొర్రలు ఒక ఎకరానికి 1.5 నుంచి 2 కేజీల విత్తనాన్ని చల్లుకోవచ్చు.

5) రైతు పేరు: జి.దుర్గారావు, గ్రామం : మేడిచెర్ల, మండలం: బాపులపాడు, జిల్లా: కృష్ణా, ఫోన్ నెంబర్: 8466082882.

ప్ర: మినుములో ఆకుల అడుగు భాగంలో తెల్ల దోమ ఆశించినవి, నివారణ తెలపండి ?

జ: మినుములో తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 10 -12 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

6) రైతు పేరు: కె. సుబ్బారెడ్డి, గ్రామం: తూర్పు చవటపాలెం, మండలం : దర్శి, జిల్లా : ప్రకాశం, ఫోన్ నెంబర్ : 7893721089.

ప్ర: ఆముదం పంట వేయాలనుకుంటున్నాను. కంది అంతర పంటగా సాగు చేయవచ్చా?

జ: ఆముదంలో కంది అంతర పంటగా సాగు చేయవచ్చు. ఒక వరుస ఆముదం పంటకు 1 లేదా 5 వరుసలలో కంది నాటుకోవాలి.

7) రైతు పేరు: సందీప్ నాయుడు, గ్రామం: కొత్తవలస, మండలం: పాచిపెంట, జిల్లా: పార్వతీపురం మన్యం, ఫోన్ నెంబర్: 7981374983.

ప్ర: మొక్క జొన్నలో కత్తెర పురుగులు ఆశించినవి, నివారణ తెలపండి ?

జ: మొక్క జొన్నలో కత్తెర పురుగు నివారణకు థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

8) రైతు పేరు : సి.వీరరాఘవులు, గ్రామం : మామిళ్ళపల్లి, మండలం : సంతమాగులూరు, జిల్లా : బాపట్ల, ఫోన్ నెంబర్ : 7842010506.

ప్ర: నువ్వుల పంటలో మిడతలు ఆశించినవి, నివారణ తెలపండి ?

జ: నువ్వుల పంటలో మిడతల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

## ఉద్యానశాఖ

1) రైతుపేరు: జయరామిరెడ్డి, గ్రామం : ఎర్రబెల్లి, మండలం: కురబలకోట, జిల్లా: అన్నమయ్య, ఫోన్ నెంబర్: 7382610997.

**ప్ర: టమాటాలో లేత ఆకులపై ఈనెలు గోధుమ రంగుకు మారి, పసుపురంగు మచ్చలు ఏర్పడి, మాడిపోతున్నాయి. మొక్కలలో ఎదుగుదల లేదు. ఏమి పిచికారీ చేయాలో సలహా ఇవ్వగలరు?**

జ: టమాటాలో స్పాటెడ్ విల్ట్ వైరస్ నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చేసే తామర పురుగులను నివారించుటకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ చొప్పున కలుపుకుని పిచికారీ చేయాలి. ఎకరానికి 20 చొప్పున నీలి జిగురు అట్టలను అమర్చాలి.

2) రైతుపేరు: శ్రీనివాస రావు, గ్రామం : గోనుగుంట, మండలం: చీమకుర్తి, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 9490812662.

**ప్ర: సుగంధలో మొక్కలు వాడిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ: సుగంధ పంటలో వేరుకుళ్ళు తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా. చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మొక్క మొదలు చుట్టూ ఉన్న నేలను బాగా తడుపుకోవాలి. మరలా 5 రోజులకు కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్క మొదల్లో పోయాలి.

3) రైతుపేరు: మాణికబాలరంగస్వామి, గ్రామం : గోశానపల్లె, మండలం: డోన్, జిల్లా: నంద్యాల, ఫోన్ నెంబర్: 7601002477.

**ప్ర: చామంతిలో ఆకులపై పిండినల్లి ఆశించినవి, నివారణ తెలపండి?**

జ: చామంతిలో పిండినల్లి నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

4) రైతుపేరు : కండె వేణుగోపాల్, గ్రామం : నేరేడుపల్లె, మండలం : వింజమూరు, జిల్లా : నెల్లూరు, ఫోన్ నెంబర్ : 9390769092.

**ప్ర: దోసలో పురుగులు ఆకులను మరియు పూలను తింటున్నాయి. నివారణ తెలియజేయగలరు?**

జ: దోసలో గుమ్మడి పెంకు పురుగు మరియు పొట్ల ఆకు పురుగు నివారణకు నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా క్వినాల్ ఫాస్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

5) రైతు పేరు : శ్యామసుందర్, గ్రామం : కారాడ, మండలం : బొబ్బిలి, జిల్లా :విజయనగరం, ఫోన్ నెంబర్ : 9494354129.

**ప్ర: కంద వేసి 60 రోజులయ్యింది. మొక్కలు వదలి వాలిపోతున్నాయి. నివారణ చెప్పండి?**

జ: కందలో వడలు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదల్లో పోసుకోవాలి. 7 రోజుల తరువాత కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదల్లో పోసుకోవాలి.

6) రైతుపేరు:కొండబాబు,గ్రామం:తునివలస, మండలం: చీడికాడ, జిల్లా : అనకాపల్లి, ఫోన్ నెంబర్ : 9491907310.

**ప్ర: పామ్ఆయిల్ తోటలో అంతర పంటలుగా వేటిని సాగుచేసుకోవచ్చు?**

జ: పామ్ఆయిల్ తోటలో అంతర పంటలుగా అపరాలు, చిరుధాన్యాలు, కూరగాయలు సాగుచేసుకోవచ్చును.

7) రైతుపేరు:సి.హెచ్ మధుకోటేశ్వరరావు, గ్రామం :లద్దగిరి, మండలం:కోడుమూరు, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 8897550664.

**ప్ర: బెండలో ఆకుతినే పురుగులు ఆశించినవి. నివారణ తెలపండి ?**

జ: బెండలో ఆకుతినే పురుగు నివారణకు క్వినాల్ఫాస్ 2 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154

1. రైతు పేరు: జగదీశ్వర్, గ్రామం : చదుల్లా, మండలం: పుంగనూరు, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెంబర్: 7799304401.



**ప్ర. టమాటా ఆకులు, కాయలపై మచ్చలు ఉన్నాయి. ఏమి పిచికారీ చేయాలి?**

జ. టమాటా పంటలో అకుమాడు తెగులు నివారణకు 3 గ్రా. మాంకోజెబ్ లేదా 2 గ్రా. క్లోరోథలోనిల్ లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో 3 లేక 4 సార్లు పిచికారీ చెయ్యాలి



2. రైతు పేరు: పర్లపల్లి నబీ, గ్రామం : మునగపాడు, మండలం: కొనకనమిట్ల, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 9603810700

**ప్ర. జామలో కాయలు గోధుమ రంగులోకి మారి ఎండిపోయి కుళ్ళిపోతున్నాయి, నివారణ తెలపండి ?**

జ. జామలో పక్షికన్ను (ఆంత్రక్నోస్) తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున 7 రోజుల వ్యవధితో లీటరు నీటికి కలుపుకొని 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

3. రైతు పేరు: వాకాడ దేవుడు, గ్రామం : కె. సంతపల్లి, మండలం: కె. కోటపాడు, జిల్లా: అనకాపల్లి, ఫోన్ నెంబర్: 6304739842



**ప్ర. సొర తోటలో ఆకుల పై భాగాన పసుపు రంగు మచ్చలు, అడుగు భాగాన ఊదా రంగు మచ్చలు, బూజు వంటి పదార్థం ఏర్పడి, పండుబారి ఎండిపోతున్నాయి, నివారణ తెలపండి?**

జ. సొర తోటలో బూజు తెగులు నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ 2 గ్రా. లేదా డైమిథోమార్ఫ్, మాంకోజెబ్ 1.5 గ్రా. మరియు జిగురు పదార్థం 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



4. రైతుపేరు: కేశవన్, గ్రామం : వళ్లూరు, మండలం: కుప్పం, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబర్: 9666333982

**ప్ర. చామంతిలో వేరుపురుగులు ఆశించినవి, నివారణ తెలపండి ?**

జ. చామంతిలో వేరుపురుగు నివారణకు 6 కిలోల క్లోరిపైరిఫాస్ గుళికలు లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి. గుళికలను సమపాళ్ళ పొడి ఇసుక లేదా వరి ధాన్యపు నూక మరియు నూనె తీయని వేప పిండి 200 కిలోలు కలిపి దగ్గరగా వేసి గుంటక లేదా గొర్రుతో అంతరకృషి ద్వారా మట్టిని కప్పేటట్లుగా చేసుకోవాలి .

5. రైతుపేరు: చాకలి తేజ, గ్రామం : కులుమాల, మండలం: గోనెగొండ్ల, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 6304681103



**ప్ర. వేరుశనగలో పొగాకు లద్దె పురుగు మరియు పచ్చపురుగులు ఆశించినవి, నివారణ తెలపండి?**

జ. వేరుశనగలో పొగాకు లద్దె పురుగు మరియు పచ్చపురుగు నివారణకు నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా క్లోర్ ఫెన్ పైర్ 2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

6. రైతుపేరు: బొంద సతీష్ కుమార్, గ్రామం : చెల్లూరు, మండలం: ఏర్పేడు, జిల్లా: తిరుపతి, ఫోన్ నెంబర్: 8309484245



**ప్ర. వరిలో ఆకుల చివర్లు ఎండిపోతున్నాయి, నివారణ తెలపండి ?**

జ. వరిలో పొటాషియం లోపం సవరణకు పొలంలో నీటిని తీసి బురద పదును మీద మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోలను ఒక ఎకరానికి చొప్పున పైపాటుగా వేసుకొని 48 గంటల తరువాత తేలికగా నీటిని అందించాలి. నత్రజని ఎరువును అధికంగా వాడరాదు.



7. రైతుపేరు: యాదగిరి హరినాధ్, గ్రామం : కునకమూరు, మండలం: దేవనకొండ, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 9642887963

**ప్ర. ప్రత్తిలో ఆకులు పసుపు రంగులోకి మారి, బెట్ట పరిస్థితులలో మొక్కలు పెరగడం లేదు, ఏమి చేయాలో తెలపగలరు ?**

జ. ప్రత్తిలో బెట్ట పరిస్థితులలో మొక్కలు ఎదుగుదలకు 19-19-19 10 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 5 రోజుల వ్యవధితో 4 సార్లు పిచికారీ చేసుకోవాలి.

8. రైతుపేరు: కరణం పృథ్వి, గ్రామం : పెనుమూరు, మండలం: పెనుమూరు, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబర్: 8686124184



**ప్ర. అరటిలో కాండం మరియు దుంప కలిసే భాగంలో కుళ్ళుమచ్చలు ఏర్పడి క్రమేపి దుంప కుళ్ళిపోతుంది, నివారణ తెలపండి ?**

జ. అరటిలో బాక్టీరియా దుంప కుళ్ళు నివారణకు తెగులు సోకిన మొక్కలని దుంపతో సహా తీసివేసి తోట బయట చిన్న ముక్కలుగా నరికి ఎండు తుక్కు వేసి తగులబెట్టాలి. మొక్కలు తీసివేసిన చోట చుట్టు ప్రక్కల ఆరోగ్యవంతమైన మొక్కల మొదళ్ళు వద్ద మట్టి బాగా తడిచేలా బ్లీచింగ్ పౌడర్ 25 గ్రా. 1 లీటరు నీటికి చొప్పున లేదా సూడోమోనాస్ 50 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర మట్టి బాగా తడిచేలాగా ప్రతి మొక్కను తడపాలి.



9. రైతుపేరు: మీరావత్తు నాగార్జున, గ్రామం : ఎలగలవంక, మండలం: బెళుగొప్ప, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 9000057066

**ప్ర. ఖర్భూజలో సరైన ఆకృతిలో పిందెలు, కాయలు ఏర్పడటం లేదు, ఏమి చేయాలో తెలపగలరు?**

జ. ఖర్భూజలో బోరాన్ లోపం నివారణకు బోరాక్స్ 1.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 5 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేయాలి. ఆ తరువాత పొటాషియం నైట్రేట్ 10 గ్రా., ఫార్మలా-4 5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 4 సార్లు పిచికారీ చేసుకోవాలి.

10. రైతు పేరు: బి. శ్రీకాంత్, గ్రామం : రామాపురం, మండలం: రామాపురం, జిల్లా: కడప, ఫోన్ నెంబర్: 9676649796



**ప్ర. అలసంద ఆకుల్లో ఈనెలు ఆకు పచ్చ రంగులో ఉండి పసుపుబారిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. అలసందలో ఇనుప ధాతు లోప సవరణకు లీటరు నీటికి 2.5 గ్రా. అన్నభేది (FeSO4), 1 గ్రా. నిమ్మ ఉప్పు లేదా ఒక బద్ద నిమ్మకాయ రసం లేదా 2 గ్రా. అగ్రోఫెర్ లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి లేదా ఫార్ములా 4 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయవచ్చు.

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు



1) రైతు పేరు: శ్రీనివాసరెడ్డి, గ్రామం: చిల్లకూరు, మండలం: చిల్లకూరు, జిల్లా: తిరుపతి, ఫోన్ నెంబర్: 9949907562.

**ప్ర: వరిలో కాండం తొలుచు పురుగులు ఆశించినవి, నివారణ తెలపండి ?**

జ: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కేజీలు మరియు 25 కేజీల ఇసుకను కలిపి ఎకరం పొలంలో చల్లుకోవాలి.

2) రైతు పేరు: వెంకట రమణారెడ్డి, గ్రామం : మోరం, మండలం: పలమనేరు, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబర్: 6281963663.

**ప్ర: వేరుశనగలో లేత ఆకులు పసుపుపచ్చగాను తర్వాత తెలుపు రంగుకు మారుతున్నాయి, నివారణ తెలపండి ?**

జ: వేరుశనగలో ఇనుము ధాతు లోపం సవరణకు అన్నభేది (ఫెర్రస్ సల్ఫేట్) – 5 గ్రా., నిమ్మ ఉప్పు 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3) రైతు పేరు: చంద్రశేఖర్, గ్రామం: నల్లదాసరపల్లి, మండలం: గుంతకల్లు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 6302587274.

**ప్ర: ఆముదంలో ఆకుల అడుగుభాగంలో రసం పీల్చే పురుగులు ఆశించినవి, నివారణ తెలపండి ?**

జ: ఆముదంలో రసం పిల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

4) రైతు పేరు: పెద్దిగాని హరికుమార్, గ్రామం: చామలూరు, మండలం: నార్పల, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 9542254096.

**ప్ర: మొక్కజొన్నలో ఆకులపై పొడవైన, కోలాకారపు బూడిద రంగుతో కూడిన ఆకుపచ్చ లేక గోధుమ వర్ణపు మచ్చలు కనిపిస్తున్నాయి, నివారణ తెలపండి ?**

జ: మొక్కజొన్నలో టర్సికమ్ ఎండు తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. వారం రోజుల తరువాత కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

5) రైతుపేరు: మట్టా మోహనబాబు, గ్రామం : వీరంపాలెం, మండలం: పెదవేగి, జిల్లా: ఏలూరు, ఫోన్ నెంబర్: 9848378721.

**ప్ర: బొప్పాయిలో మొక్కల పెరుగుదల ఆగిపోయి, ఆకులు పసుపుబారి కాడలు క్రిందకి వంగిపోయి చనిపోతున్నాయి. నివారణ తెలపండి ?**

జ: బొప్పాయిలో పేనుబంక ద్వారా వ్యాప్తి చెందే ఆకుముడత వైరస్ తెగులు నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

6) రైతుపేరు: తెగడుద్ది రామకృష్ణ, గ్రామం: గోశానపల్లె, మండలం: డోన్, జిల్లా: నంద్యాల, ఫోన్ నెంబర్: 8919343905 .

**ప్ర: టమాటాలో మొక్కలు నాటి 15 రోజులు అవుతుంది, తుంగ తదితర గడ్డి జాతి మరియు వెడల్పాకు కలుపు మొక్కలు ఉన్నవి. ఏమి పిచికారీ చేయాలో తెలుపగలరు?**

జ: టమాటా నాటిన 15 రోజులకు కలుపు నివారణకు మెట్రిబుజిన్ 300 గ్రా.ను ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి వరుసల మధ్య పిచికారీ చేసుకోవాలి. నాటిన 30, 35 రోజులప్పుడు గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి.

7) రైతు పేరు:గొర్ల శ్రీనివాసులు, గ్రామం: నరసాపురం, మండలం: కణేకల్లు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెం: 9640037442.



**ప్ర: మిరపలో ఆకులు పైకి పడవ ఆకారంలో ముడుచుకొని, పసుపుబారు తున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ: మిరపలో ఆకుముడత (జెమినీ వైరస్) తెగులును వ్యాప్తి చేసే తెల్లదోమ నివారణకు థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా స్పైరో మెసిఫిన్ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో మందులను మార్చి 2 సార్లు పిచికారీ చేసుకోవాలి. ఎకరానికి 20 చొప్పున పసుపు జిగురు అట్టలు అమర్చుకోవాలి.

8) రైతు పేరు : కొత్తపల్లి ప్రకాష్, గ్రామం : చిల్లకొండయ్యపల్లె, మండలం : తాడిమర్రి, జిల్లా : శ్రీసత్యసాయి, ఫోన్ నెం:9392895697.

**ప్ర: దానిమ్మలో పురుగులు బెరడు మరియు కాయలను తొలిచేస్తున్నాయి. నివారణ చెప్పండి ?**

జ: దానిమ్మలో బెరడు తినే పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.




# రైతుల స్పందన

చెఱకు పంటలో తెల్లదోమ నివారణకు డైమిథోయేట్ 1.7 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. సలహా ఇచ్చిన రైతు సమాచార కేంద్రం వారికి నా కృతజ్ఞతలు.

వర్మ రాజు,
కుమరాం, గరివిడి,
జిల్లా : విజయనగరం,
ఫోన్ :
**8688400480.**

సాంబశివ రావు,
మొగిలిచెర్ల,
లింగసముద్రం,
జిల్లా: నెల్లూరు,
ఫోన్ :
**9000526489.**

సమీకృత రైతు సమాచార కేంద్రం వారు ఇచ్చిన సలహా ప్రకారం మునగ పంటలో ఆకుతినే పురుగు నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. మరియు మోనోక్రోటోఫాస్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. చాలా వరకు పురుగు ఉధృతి తగ్గింది. వారికి నా ధన్యవాదాలు.

ప్రత్తి పంటలో వేరుకుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదల్లో పోశాను. పంట బాగుంది. రైతు సమాచార కేంద్రం సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

రామచంద్ర,
చింతలచెరువు,
పెద్దవడుగూరు,
జిల్లా : అనంతపురం,
ఫోన్ :
**9160234833.**

బైరెడ్డి సోమశేఖర్, :
పెద్దగడిదేశిపల్లె,
పుంగనూరు,
జిల్లా : చిత్తూరు,
ఫోన్ :
**9542858034.**

వంగ పంటలో తెల్లదోమ నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. ఐ.సి.సి కి ధన్యవాదాలు.

వేరుశనగలో ఆకుముడత నివారణకు నొవల్యురాన్ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పంట బాగుంది. సలహా ఇచ్చిన ఐ.సి.సి వారికి ధన్యవాదాలు.

శివ రెడ్డి,
నాగసముద్రం, :
చెన్నెకొత్తపల్లి,
జిల్లా : శ్రీ సత్యసాయి,
ఫోన్ :
**9493271305.**

రెడ్డప్ప రెడ్డి,
రేణుమాకులపల్లి,
తంబళ్ళపల్లె, జిల్లా :
అన్నమయ్య,
ఫోన్:
**9502215154.**

ఐ.సి.సి వారు చెప్పినట్టు టమాటాలో ఆకుముడత వైరస్ సోకినపుడు ఇమిదాక్లోప్రిడ్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. మరలా ఈ లక్షణాలు కనిపించలేదు. పంట బాగుంది. కృతజ్ఞతలు.

# జులై నెల విజేత

## వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయాధికారి ప్రథమం

2023 జులై నెలకు గాను రాష్ట్రం లోని 26 జిల్లాల్లో
వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయాధికారి
**అయితా నాగేశ్వరరావు ప్రథమంగా నిలిచారు.**
నాలుగు నెలల పాటు వరుసగా ప్రథమ స్థానంలో నిలుస్తున్న జిల్లా వ్యవసాయాధికారికి ఉన్నతాధికారులు, సహచరులు అభినందనలు తెలిపారు.
తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయాధికారి, శ్రీ ఎస్. మాధవరావు ద్వితీయ స్థానంలో నిలిచారు.



**అయితా నాగేశ్వరరావు**
వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయాధికారి

## ఉత్తమ సేవలందిస్తున్న ఆర్.బి.కె. సిబ్బంది



**వి. శ్రీను**
వెంకట నగరం, అడ్డతీగల మం. అల్లూరి సీతారామరాజు



**పి. రాంప్రసాద్**
వజ్రగడ, మాకవరపుపాలెం మం. అనకాపల్లి



**డి. సంధ్య**
ఉల్లికల్లు, శింగనమల మం. అనంతపురం



**డి. పృథ్వీరాజ్**
పొన్నేటిపాలెం, మదనపల్లి మం., అన్నమయ్య



**బి. నరేంద్ర**
చెరుకుపల్లి, చెరుకుపల్లి మం., బాపట్ల



**డి. సురేష్**
కొవ్వూరుపాడు, గోపాలపురం మం., తూర్పు గోదావరి



**టి. ఢిల్లీబాబు**
పెనుమూరు, పెనుమూరు మం., చిత్తూరు



**డి. వెంకన్న**
వట్లూరు-2, పెదపాడు మం. ఏలూరు



**బి. బాబూరావు**
నంబూరు, పెదకాకాని మం. గుంటూరు



**ఆర్. అరవింద్**
కొండపల్లి, పెద్దాపురం కాకినాడ



**బి. శ్రీహర్ష**
లక్కవరం-2, మల్కిపురం మం., కోనసీమ



**జె. అజయ్‌బాబు**
వెంట్రప్రగడ-2, పెదపారుపూడి మం., కృష్ణా



**బి. స్వప్న**
నాగలాపురం, ఆదోని మం. కర్నూలు



**జి. అంజిత్‌కుమార్‌రెడ్డి**
అబ్దుల్లాపురం, వెలుగోడు మం., నంద్యాల



**సి. ఎస్తేరు రాణి**
చౌటుపల్లి, వీరులపాడు మం., ఎన్.టి.ఆర్,



**యం. బోసు**
పాలపాడు, నరసరావుపేట మం., పల్నాడు.



**జె. జగదీష్**
రావివలస, గరుగుబిల్లి మం., పార్వతీపురం మన్యం



**ఆర్. సుప్రజ**
హనుమంతపురం, హెచ్. ఎం.పాడు మం., ప్రకాశం



**పి. ఇమ్రాన్‌ఖాన్**
నాగులవెల్లటూరు, చేజెర్ల మం., నెల్లూరు



**బి. శశికుమార్**
మల్లాకాలువ, ధర్మవరం మం., శ్రీ సత్యసాయి



**కె. చందు**
చిల్లకూరు, పెళ్ళకూరు మం., తిరుపతి



**జి. రాజేశ్వరి**
గొట్టిపల్లి, ఆనందపురం మం., విశాఖపట్నం



**బి. సంగమేసు**
పాలవలస, గుర్ల మం., విజయనగరం.



**పి. కుసుమ కుమార్**
పట్టెంపాలెం, తాడేపల్లి గూడెం మం., పశ్చిమ గోదావరి.



**జి. వెంకటేష్‌రాజు**
కమలాపురం-1, కమలాపుం మం., వైఎస్ఆర్



**ఎల్. యమున**
నరసింగపల్లి, టెక్కలి మం. శ్రీకాకుళం

# వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం

## ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

ANGRAU

### వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం
### ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థికశాస్త్ర విభాగం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, లాం, గుంటూరులో వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2023-24 ఖరీఫ్ కాలంలో సాగుచేయబోయే వివిధ రకాల పంటల ముందస్తు ధరలు పంటకోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు ఈ క్రింద విధముగా ఉండవచ్చును.

| క్ర. సం. | పంటలు | అంచనా ధరలు (రూ/ క్వి.) | అంచనా ధరలు వర్తించు సమయం |
|---|---|---|---|
| 1 | వరి | 1,975- 2,250 (సాధారణ రకాలు) | ఖరీఫ్ పంటకోత సమయం (2023-24) |
| | | 2,100- 2,325 (ఏ గ్రేడ్ రకాలు) | |
| 2 | మిరప | 16,500-19,550 (సాధారణ రకాలు) | |
| | | 18,000-22,100 (ప్రత్యేక రకాలు) | |
| 3 | ప్రత్తి | 5,800- 6,750 | |
| 4 | పసుపు | 5,200- 5,830 (కాయలు) | |
| | | 5,500- 6,030 (కొమ్ములు) | |
| 5 | మొక్కజొన్న | 1,950- 2,250 | |
| 6 | జొన్న | 2,500- 3,230 (హైబ్రిడ్) | |
| 7 | కందులు | 6,300- 7,210 | |
| 8 | మినుము | 6,400- 7,100 | |
| 9 | పెసలు | 7,450- 8,650 | |
| 10 | వేరుశనగ | 5,670- 6,550 | |
| 11 | శెనగ | 4,650- 5,250 | |

ముందస్తు ధరలు సమాచారం కోసం సంప్రదించగలరు.....


**డా॥ జి. రఘునాథ రెడ్డి,** ప్రధాన పరిశోధకులు

మొబైల్ నెం. 9848321232, 18004198800

ఈ మెయిల్: amic2018angrau@gmail.com

వెబ్ సైట్: www.angrau.ac.in


గమనిక : పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 16 నుండి 28 సం॥ల ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా, లేదా ప్రభుత్వ మధ్యంతర జోక్యం / వివిధ పథకాల వల్ల అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏవిధమైన బాధ్యత వహించదు.

